RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY
తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 240 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | గురువారం, మార్చి,19, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 240 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Thursday, March,19, 2026 | PAGES : 8 RS : 4 /- |




## బిల్కిస్ కేసులో..
# మరో మలుపు

### విడుదల కోసం దోషుల కొత్త పిటిషన్


ఢిల్లీ,: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన బిల్కిస్ బానో కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులోజీవిత ఖైదు అనుభవిస్తున్న దోషులు తమను ముందస్తుగా విడుదల చేయాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. ఈ అంశంపై స్పందన తెలియజేయాలని గుజరాత్, మహారాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. 2002 గుజరాత్ అల్లర్ల సమయంలో బిల్కిస్ బానోపై సామూహిక అత్యాచారం, ఆమె కుటుంబ సభ్యుల హత్య కేసులో 11 మందికి జీవిత ఖైదు పడిన సంగతి తెలిసిందే. అయితే, గుజరాత్ ప్రభుత్వం 2022లో వీరిని విడుదల చేయగా, ఆ నిర్ణయాన్ని సుప్రీంకోర్టు ఈ ఏడాది జనవరిలో రద్దు చేసింది. కోర్టు ఆదేశాలతో దోషులంతా తిరిగి జైలుకు వెళ్లారు.



## మొయినాబాద్ డ్రగ్స్ కేసులో
# సిట్ వేశాం

- నిబంధనల మేరకే స్టేషన్ బెయిల్
- 2029లోనే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు
- ఢిల్లీలో సిఎం రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ,మార్చి18 : మొయినాబాద్ డ్రగ్స్ కేసుపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. దీనిలో తమ ప్రమేయం ఏమీ లేదని ఆయన చెప్పారు. దిల్లీ పర్యటనలో ఉన్న ఆయన మీడియాతో మాట్లాడారు. మొయినాబాద్ డ్రగ్స్ కేసులో నిబంధనల ప్రకారమే స్టేషన్ బెయిల్ ఇచ్చారు. దీనిలో మా ప్రమేయం ఏమీ లేదు. ఈ వ్యవహారంపై దర్యాప్తునకు సిట్ వేశాం అని చెప్పారు. 2029లోనే తెలంగాణలో ఎన్నికలు జరుగుతాయని సీఎం అన్నారు. 2028లో ఎన్నికలు రావని చెప్పారు. మహిళా రిజర్వేషన్లు ముందుగా అమల్లోకి వస్తే మంచిదేనని అభిప్రాయపడ్డారు. అంతకుముందు పార్లమెం ట్‌లో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీలను రేవంత్‌రెడ్డి కలిశారు. టీపీసీసీ అధ్యక్షుడు మ హేశ్‌కుమార్ గౌడ్‌తో కలిసి వెళ్లి వారితో సమావేశమ య్యారు. ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన వేం నరేందర్‌రెడ్డిని రాహుల్, ప్రియాంకలకు రేవంత్ పరిచయం చేశారు. పార్లమెంట్‌లో వైసీపీ నేత, మాజీ మంత్రి రోజా సీఎం రేవంత్ రెడ్డి, ఎదురుపడ్డారు. ఈ సందర్భంగా వారిరువురు ఒకరినొకరు పలకరించుకున్నారు.




## రాజకీయాల్లో ఫుల్‌స్టాప్
# ఉండదు
## ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: రాజకీయాల్లో ఫుల్‌స్టాప్ ఉండదని ప్రధాని మోదీ అన్నారు. ఇవాళ ఆయన రాజ్యసభలో ప్రసంగించారు. 59 మంది సభ్యులు రిటైర్ అవుతున్న నేపథ్యంలో ఆయన మాట్లాడారు. తన సందేశంతో ఆ సభ్యులకు వీడ్కోలు పలికిన ప్రధాని మోదీ మాట్లాడుతూ పార్లమెంట్ ఓ ఓపెన్ యూనివర్సిటీ లాంటిదన్నారు. రిటైర్ అయి వెళ్లిపోతున్న ఎంపీలు.. దేశం కోసం తమ విధులను నిర్వర్తిస్తూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఫేర్‌వెల్ లాంటి సందర్భాల్లో పార్టీల మధ్య ఉన్న విబేధాలు సమసిపోతాయన్నారు.

# మూసీ ప్రక్షాళన పేరుతో లక్షన్నరకోట్ల దోపిడీ...!

- డిపిఆర్ లేదు..ప్రణాళిక లేకుండా ఎలా – మూసీ ప్రక్షాళనపై స్పష్టత లేని ప్రభుత్వం
- పేదల ఇళ్లు కూల్చివేత దారుణం – బఫర్ జోన్ నిర్ణయంలోనూ అస్పష్టత
- అసెంబ్లీలో మూసీ ప్రక్షాళనపై నిలదీసిన కెటిఆర్ – ప్రభుత్వ తీరుకు నిరసనగా బిఆర్ఎస్ వాకౌట్



**హైదరాబాద్, మార్చి18,తెలంగాణ దిశ:** మూసీనది ప్రక్షాళనకు తమకు ఎలాంటి వ్యతిరేకత లేదని, అయితే ప్రభుత్వం మూసీ ప్రాజెక్ట్ పేరుతో లక్షన్నర కోట్ల రూపాయల దోపిడీకి పాల్పడుతున్నందున దాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ అంశంపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా బుధవారం అసెంబ్లీ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ మేరకు అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. అసెంబ్లీలో మూసీ ప్రక్షాళనపై బీఆర్ఎస్ సభ్యులు అడిగిన ప్రశ్నకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన దాటవేసే ధోరణిలో సమాధానం ఇవ్వడంపై కేటీఆర్‌మండిపడ్డారు. ప్రభుత్వం దగ్గర పైసలు లేవు.. ప్రణాళికలు లేవని విమర్శించారు. మూసీ ప్రక్షాళనకు మేం వ్యతిరేకం కాదు.. లక్షన్నర కోట్ల దోపిడీకి మాత్రమే వ్యతిరేకమని స్పష్టం చేశారు. మూసీ ప్రక్షాళనపై అసెంబ్లీలో బుధవారం జరిగిన చర్చ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కేటీఆర్ పలు ప్రశ్నలు సంధించారు. మూసీ ప్రాజెక్టు కోసం రుణం మంజూరైందని గతంలో మంత్రి చెప్పారని తెలిపారు. డీపీఆర్ కూడా సబ్‌మిట్ చేయలేదని అప్పుడు ఏడీబీ చెప్పిందని పేర్కొన్నారు. రుణం మంజూరు కాలేదని ఈ నెల 11వ తేదీన ఏడీబీ లేఖ ఇచ్చిందన్నారు. డీపీఆర్ తయారీకి 18 నెలలు పడుతుందని గతంలో ప్రభుత్వం చెప్పిందని గుర్తుచేశారు. 18 నెలలు పడుతుందన్న డీపీఆర్ రెండు నెలల్లో ఎలా వచ్చిందని ప్రశ్నించారు. మూసీ ప్రాజెక్టు మొదటి ఫేజ్ తర్వాత ఎన్ని ఫేజులు ఉంటాయని కేటీఆర్ అడిగారు. మూసీ ప్రాజెక్టుకు ఎన్ని ఫేజులు ఉన్నాయని ప్రశ్నించారు. రూ.16వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టు లక్షన్నర కోట్లు ఎందుకు అని నిలదీశారు. మూసీ ప్రాజెక్టులో బఫర్ జోన్ ఎంత అని ప్రశ్నించారు. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టుతో వేలాది మంది నష్టపోతున్నారని తెలిపారు. మూసీ ప్రాజెక్టుతో రేవంత్ సర్కార్ గృహమేధ యాగం చేస్తోందని మండిపడ్డారు. బ్లాక్ లిస్ట్ చేసిన కంపెనీలకు కాంట్రాక్టు ఎందుకిస్తున్నారని ప్రశ్నించారు. డీపీఆర్ లేకుండా హడావిడిగా ఇళ్లు ఎందుకు కూలుస్తున్నారని అడిగారు. కేటీఆర్ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక నీళ్లు నమిలిన ప్రభుత్వం.. దాటవేసే ధోరణిలో వ్యవహరించింది. దీంతో బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. మూసీపై రేవంత్ సర్కార్ తీరుకు నిరసన తెలిపారు. ముఖ్యంగా డీపీఆర్ తయారీ, ఇళ్ల కూల్చివేతలు, భూసేకరణ, ప్రాజెక్ట్ వ్యయం పెంపు, అలాగే ప్రభుత్వం చేస్తున్న విభిన్న ప్రకటనలలో ఉన్న విరుద్ధతలను ఎత్తిచూపుతూ ప్రభు త్వాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, సుధీర్ రెడ్డి, కాలేరు వెంకటేష్, బండారు లక్ష్మారె డ్డి కలిసి మూసీ ప్రాజెక్టుపై అనేక సందేహాలను వ్యక్తం చేశారు. మొత్తం 16 వేలకోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టును లక్షన్న ర కోట్లకు పెంచడం వెనుక ఉద్దేశ్యం ఏమిటో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు.



## బెంగాల్ పోరు..
# మమత 'సర్జికల్ స్ట్రైక్'

కలకత్తా:పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల సమరానికి తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)అధినేత్రి మమతా బెనర్జీ శంఖారావం పూరించారు. ఈసారి అభ్యర్థుల ఎంపికలో అత్యంత సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకు న్నారు. పార్టీపై ఉన్న వ్యతిరేకతను అధిగమించే లక్ష్యంతో, ఏకంగా 74 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు నిరాకరించి అందరినీ ఆశ్చర్యపరిచారు. అవినీతి ఆరోపణలు, పనితీరు సరిగా లేని వారిని పక్కనపెట్టి, 'క్లీన్ ఇమేజ్' ఉన్న కొత్త ముఖాలకు ప్రాధాన్యమిచ్చారు






## ప్రతిపక్ష పార్టీ అయ్యేలా
# కవిత వ్యూహమా?

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** ఐయామ్ వాయిస్ ఆఫ్ వాయిస్‌లెస్. ప్రజల గొంతుగా నిలబడతా. ఎప్పుడో ఓసారి తెలంగాణకు ముఖ్యమంత్రిని అయి తీరుతా. జాగృతి అధ్యక్షురాలు కవిత స్టేట్‌మెంట్స్ ఇవి. బీఆర్ఎస్‌ను వీడినప్పటి నుంచి ప్రత్యేక రాజకీయఎజెండాతో ముందుకెళ్తున్న కవిత.. ఓవైపు పార్టీ ఏర్పాటు కోసం కసరత్తు చేస్తూనే..అసలు సిసలు ప్లాన్‌ను ఇంప్లిమెంట్ చేస్తున్నారు. పరిస్థితులను బట్టి..పొలిటికల్ ఈక్వేషన్స్ బేరీజు వేసుకుని..ఆల్ ఆఫ్ సడెన్‌గా ప్రజా సమ స్యలపైఫోకస్ పెట్టారు. వరుస కార్యక్రమాలు, మెరుపు ధర్నాలు, దీక్షలతో అధికార కాంగ్రెస్ తీరుపై నిరసన తెలుపుతూనే..ఇటు బీఆర్ఎస్, బీజేపీపై విమర్శల దాడిని కంటిన్యూ చేస్తున్నారు. ఓ రకంగా తానే అసలైన ప్రతిపక్షం అన్న లెవల్‌కు ఎదిగేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారట కల్వకుంట్ల కవిత. త్వరలోనే రాజకీయ పార్టీని ప్రకటించేందుకు రెడీ అవుతున్నారు కవిత. అంతలోపే అంశాల వారీగా తనదైన శైలితో పోరాటం మొదలుపెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ నిర్ణయాలు, విధానాలపై ఫైట్ చేస్తూ వస్తున్నారు. చిన్న పెద్ద అని తేడా లేకుండా తన దృష్టికి వచ్చిన ప్రతి అంశంపై రియాక్ట్ అవుతున్నారు కవిత. హైదరాబాద్ నుంచి మొదలు రాష్ట్రంలో ఎక్కడ ప్రజల సమస్యలు ఉంటే అక్కడికి వెళ్తున్నారామె. అంశాన్ని బట్టి నిరసనలు, ధర్నాలు చేస్తూ..వార్తల్లో నిలుస్తున్నారు.



## బీఆర్ఎస్ పాఠాలు
# నేర్చుకోదా?

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** బీఆర్ ఎస్ పార్టీ నాయకత్వం అలసత్వం తో తనకు తాను చిక్కులు కొని తెచ్చుకుంటోంది. పైలట్ రోహిత్ రెడ్డి డ్రగ్స్ కేసులో అడ్డంగా దొరి కినా మిన మేషాలు లెక్కపెడు తూ ఈరోజు షోకాజ్ నోటీసులు జారీ చేయడం ఆపార్టీ ప్రజల్లో పలుచనగా మారిందనే చెప్పాలి. మొయినా బాద్ ఫామ్ హౌస్ అనేది పైలట్ రోహిత్ రెడ్డిది. అక్కడ పోలీసులపై కాల్పులు జరపడమే కాకుండా డ్రగ్స్ వాడారని నిర్ధారణ అయింది. ఈ డ్రగ్స్ కేసులో ఆరోపణలను ఎదుర్కొంటున్న పుట్టా మహేశ్‌కు తెలుగుదేశం పార్టీ వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేసింది. కానీ బీఆర్ఎస్ నేడు నింపాదిగా నోటీసులు ఇవ్వడం రాజకీయంగా చర్చనీయాంశమైంది.

# వాసవి మిత్ర మండలి ఆధ్వర్యంలో అమావాస్య అన్న ప్రసాద వితరణ





**ఏఎస్ రావునగర్, మార్చి 18, (తెలంగాణ దిశ)** :వాసవి మిత్ర మండలి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈసీఐఎల్ చౌరస్తాలోని సాయిబాబా మందిర్ ప్రాంగణంలో బుధవారం అమావాస్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు . అనంతరం కుషాయిగూడకు చెందిన పేద వృద్ధులు మాలే వరమ్మ, కొండూరి విజయ, తోడుపునూరి ఉమారాణి, పడకంటి కమలమ్మలకు ఈ నెల పెన్షన్ కింద రూ. వెయ్యి చొప్పున నలుగురికి అంద జేశారు. ఈ కార్యక్రమంలో వాసవి మిత్ర మండలి జిల్లా అధ్యక్షులు పెద్ది నాగరాజు గుప్త, ప్రధాన కార్యదర్శి రెబెల్లి శ్రీనివాస్ గుప్త, కోశాధికారి రాముని తిరుమలేష్ గుప్త, నిర్వాహక కార్యదర్శి గంప కృష్ణ గుప్త, ఉపాధ్యక్షులు నంగునూరి అశోక్ గుప్త, తాటి శ్రీనివాస్ గుప్త, కార్యదర్శులు బచెల్లి నవీన్ గుప్త, అమర కృష్ణ గుప్త, చందా సంతోష్ గుప్త, కార్యవర్గ సభ్యులు ఉప్పల శ్రీనివాసులు గుప్త, మిర్యాల అరుణ్ కుమార్ గుప్త, రాయికంటి వేణు గుప్త, పెన్పెన్ శెట్టి రమేష్ గుప్త, ఎన్నిశెట్టి రమేష్ గుప్త, సభ్యులు గుప్తా పెద్ది శ్రీనివాస్ గుప్త, చంద్రగిరి తారకేశ్వర్ గుప్త, అర్థం శ్రీనివాస్ గుప్త, రవ్వ ఈశ్వరరావు గుప్త, బెలిదే భగవాన్ గుప్త, నంబూరి నాగేంద్ర గుప్త, నీల కిషోర్ గుప్త, కూర శ్రీనివాస్ గుప్త, రాయికంటి ముత్యాల గుప్త, రాయికంటి ముత్యాల గుప్త, దిడిగం కైలాసం గుప్త, కారం అనిల్ గుప్త, గట్టు బాలకృష్ణ గుప్త, తాల్లపల్లి అశోక్ గుప్త, గజ్జల రమేష్ గుప్త, విబివి కృష్ణ గుప్త, గట్టు చందు గుప్త, పెద్ది నవీన్ గుప్త తదితరులు పాల్గొన్నారు.



# ఉగాది వేడుకలతో కళకళలాడిన కాప్రా పాఠశాల





**కాప్రా, మార్చి 18, (తెలంగాణ దిశ)** :కాప్రా గాంధీనగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఉగాది పండుగ వేడుకలను ఆనందోత్సాహాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బత్తుల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ఉగాది పచ్చడి తయారు చేయించి, దాని ప్రత్యేకతను వారికి వివరించారు. జీవితంలోని షడ్రుచులు అయిన తీపి, చేదు, పులుపు, ఉప్పు, కారం, వగరు మనిషి అనుభవాలకు ప్రతీకలని విద్యార్థులకు తెలిపారు. అదే విధంగా ఉగాది తెలుగు ప్రజల నూతన సంవత్సర ఆరంభమని, ఈ సంవత్సరం శ్రీ పరాభవ నామ సంవత్సరమని, తెలుగు సంవత్సరాలు మొత్తం అరవై ఉ ంటాయని వివరించారు. అనంతరం విద్యార్థులకు ఉగాది పచ్చడి పంపిణీ చేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసే గొప్ప సందర్భంగా ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంజుల, రమ, బాలరాజు, రాఘవేందర్ గౌడ్, వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

# వెజిటబుల్ మార్కెట్‌లో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు

**కుషాయిగూడ, మార్చి 18, (తెలంగాణ దిశ):** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా కుషాయిగూడ వెజిటబుల్ మార్కెట్ పరిధిలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం చేపట్టారు. మార్కెట్‌లో చెత్తాచెదారం పేరుకుపోకుండా పారిశుద్ధ్య సిబ్బందితో విస్తృతంగా శు భ్రపరిచే పనులు నిర్వహించి చెత్తను తొలగించారు. ఈ కార్యక్రమంలో కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీహరి పాల్గొని పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అలాగే సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ డిఈ రవి, పారిశు ద్ధ్య విభాగం సూపర్‌వైజర్ సుదర్శన్, జవాన్ రాజన్, ఎస్ఎఫ్ఏ కె.లక్ష్మి, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొని శుభ్రత కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ఇలాంటి ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. మార్కెట్ ప్రాంతాల్లో స్వచ్ఛత పాటించడం ప్రజల ఆరోగ్య రక్షణకు ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు.

# ఘనంగా మాజీ మంత్రి తూళ్ల దేవేందర్ గౌడ్‌కు జన్మదిన వేడుకలు





**ఏఎస్ రావునగర్, మార్చి 18, (తెలంగాణ దిశ)** : జిల్లా పరిషత్ చైర్మన్ స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగి బీసీ సంక్షేమం, రెవెన్యూ, సినిమాటోగ్రఫీ, హోంశాఖ మంత్రిగా సేవలందించిన మాజీ రాజ్యసభ సభ్యులు, సీనియర్ నాయకులు తూళ్ల దేవేందర్ గౌడ్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ రావు నగర్ డివిజన్ కు చెందిన పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు తుక్కుగూడలోని ఆయన నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు తూళ్ల దేవేందర్ గౌడ్‌ను ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పేద ప్రజలకు అభివృద్ధి ఫలాలను అందించి, ప్రజల మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న వెనుకబడిన తరగతుల నాయకుడిగా ఆయనను కొనియాడారు. అందరినీ ఆప్యాయంగా పలకరించే మంచి మనసున్న నాయకుడిగా అభివర్ణించారు. అనంతరం తూళ్ల దేవేందర్ గౌడ్ తనయుడు, బీజేపీ తెలంగాణ ప్రధాన కార్యదర్శి తూళ్ల వీరేందర్ గౌడ్‌ను కూడా సన్మానించారు. అలాగే వీరేందర్ గౌడ్ వ్యక్తి గత కార్యదర్శి శశికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ తెలుగు దేశం పార్టీ మల్కాజిగిరి, మేడ్చల్ జిల్లా కన్వీనర్ కందికంటి అశోక్ కుమార్ గౌడ్, తెలంగాణ తెలుగు దేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి నీరుకొండ సతీష్ బాబు, మాజీ కౌన్సిలర్ గడ్డమీది రాములు యాదవ్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎం. శివానంద్, సీనియర్ నేతలు గొట్టిపాటి వెంకటేశ్వరరావు, డాక్టర్ ఏఎస్ రావునగర్ డివిజన్ బిజేఆర్ కాలనీ అధ్యక్షుడు ఎస్ఏ. రహీమ్, ఉప్పల్ డివిజన్ అధ్యక్షుడు టిక్కా ప్రకాష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# అమావాస్య అన్నప్రసాద వితరణ..





**కుషాయిగూడ, మార్చి 18, (తెలంగాణ దిశ)** :మారుతి మిత్రమండలి ఆధ్వర్యంలో కుషాయిగూడ పోచమ్మ దేవాలయం వద్ద ప్రతి అమావాస్య సందర్భంగా నిర్వహించే అన్నప్రసాద వితరణ కార్యక్రమం బుధవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా తొలిత యాదగిరి, నాగేశ్వరి, మన్మధరావులు పోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మారుతి మిత్రమండలి అధ్యక్షులు గురుంచి అశోక్ చారి, ప్రధాన కార్యదర్శి వరగంటి ఆంజనేయు లు (హనుమంతు), కోశాధికారి మచ్చ బాబు గౌడ్, శీలం శ్రీనివాస్, గుంటి ఆంజనేయులు, గురుమంచి వేణు చారి, చల్లా వీరేశం, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించి దేవుని ఆశీస్సులు పొందారు.

# ఉగాది కవి సమ్మేళనంలో ప్రతిభ చాటిన ఓదెల నరేష్‌కు పురస్కారం



**వేములవాడ, మార్చి 18, (తెలంగాణ దిశ)** : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణానికి చెందిన వికలాంగ కవి ఓదెల నరేష్ ఉగాది సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనంలో ప్రతిభ కనబరిచి పురస్కా రం అందుకున్నారు. కరీంనగర్‌లో లయన్స్ ఇంటర్నేషనల్, సమైక్య సాహితి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది కవి సమ్మేళనంలో ఓదెల నరేష్ తన కవితలను ప్రదర్శించి సభికుల ప్రశంసలు పొందారు. ఈ సందర్భంగా కరీంనగర్ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ మహేశ్వర్ చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. ఓదెల నరేష్ మాట్లాడుతూ తాను 2011 సంవత్సరం నుంచి నిరంతరం కవితలు రాస్తూ వస్తున్నానని, తన కవితా ప్రయాణాన్ని గుర్తించి ఈ పురస్కారంతో సత్కరించడం ఆనందంగా ఉందని తెలిపారు. తన ప్రతిభను రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం గుర్తించి ప్రత్యేక కేసు కింద ఉ ద్యోగావకాశం కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మాడిశెట్టి గోపాల్, రీజియన్ చైర్మన్ లయన్స్ గాలిపల్లి వెంకట్, ప్రధాన కార్యదర్శి కె.ఎస్. అనంతాచార్య, ప్రొఫెసర్ డాక్టర్ అడువాల సుజాత, పలువురు కవులు, సాహితీ ప్రముఖులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు ఐక్యతే బలం

## – మహిళ వేడుకల్లో పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి



**ఏఎస్ రావునగర్, మార్చి 17, (తెలంగాణ దిశ)** : కాప్రా సర్కిల్ డాక్టర్ ఏఎస్ రావు నగర్ మహిళా మండలి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజం సుస్థిర అభివృద్ధి సాధించాలంటే మహిళా సాధికారత అత్యంత అవసరమని పేర్కొన్నారు. విద్య, ఉపాధి, రాజకీయాలు, సామాజిక సేవ సహా అన్ని రంగాల్లో మహిళలు తమ ప్రతిభను చాటుతూ సమాజానికి మార్గదర్శకులుగా నిలుస్తున్నారని కొనియాడారు. మహిళల హక్కుల పరిరక్షణతో పాటు వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని ఆమె అన్నారు. మహిళలంతా ఐక్యంగా ఉండి తమ సామర్థ్యాన్ని మరింత బలంగా నిరూపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షురాలు డి. విజయ, ఉపాధ్యక్షురాలు పి. సువర్ణ, కార్యదర్శి రంజనా మలాకర్, సంయుక్త కార్యదర్శి వైడి. నిర్మల, కోశాధికారి పి. నాగలక్ష్మి, సభ్యులు కమల, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



# గీతాంజలి కళాశాలలో భాస్వర - 2026

# సాంకేతిక మహోత్సవం

## ఘనంగా ఏఐసీటీఈ ఆలోచనా ప్రయోగశాల ప్రారంభం





**కీసర,మార్చి 18,(తెలంగాణ దిశ):** కీసర మండలం చీర్యాల లోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో 19వ జాతీయ స్థాయి సాంకేతిక మహోత్సవం భాస్వర–2026తో పాటు ఏఐసీటీఈ ఆలోచనా ప్ర యోగశాలను జెఎన్ టి యూహెచ్ ఉపకులపతి డాక్టర్ టి. కిషన్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ మహోత్సవం మంగళ, బుధవా రాలలో రెండు రోజుల పాటు నిర్వహించారు. ఈ మహోత్సవంలో పరిశోధనా పత్రాల సమర్పణలు, గోడ పత్రాల ప్రదర్శనలు, ప్రాజెక్టుల ప్రదర్శన, సాంకేతిక విజ్ఞాన ప్రశ్నోత్తర పోటీలు తదితర విభాగాలలో భారీ సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ఆకర్షణీయమైన నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జిఆర్. రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఆర్. హరిశ్చంద్ర రెడ్డి, సంచాలకుడు డాక్టర్ ఎస్. ఉదయ్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సాగర్, భాస్వర–2026 నిర్వాహకురాలు డాక్టర్ డి. సుజాత, సహ నిర్వాహకుడు డాక్టర్ ఈ.రవీంద్ర, ఆలోచనా ప్రయోగశాల సమన్వ యకర్త డాక్టర్ జి. వల్లతన్, సహ సమన్వయకర్త డాక్టర్ కె. వెంకటేష్ పాల్గొన్నారు. అలాగేకళాశాల డీన్లు, అన్ని విభాగాలాధిపతులు, అధ్యా పకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపకులపతి డాక్టర్ టి. కిషన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఏఐసీటీఈ ఆలోచనా ప్రయోగశాల వంటి వసతులు విద్యార్థుల్లో సృజనాత్మక తను పెంపొందించడంతో పాటు నూతన ఆవిష్కరణలకు మార్గం సుగమం చేస్తాయని తెలిపారు. అలాగే భాస్వర–2026 వంటి జాతీయ స్థాయి సాంకేతిక మహోత్సవాలు విద్యార్థులు తమ సాంకేతిక ప్రతిభను చాటుకునేందుకుమంచి వేదికలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. కళాశా ల చైర్మన్ జిఆర్. రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ఏఐసీటీఈ ఆలోచనా ప్రయోగశాల ద్వారా విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరికరాలను వినియోగించిప్రాజెక్టులు, నమూనా రూపకల్పనలు, సరికొత్త ఆవిష్కర ణలను అభివృద్ధి చేసుకునే అవకాశం పొందుతారని తెలిపారు.





# సంపాదకీయం

## బయో ఫ్యూయెల్‌కు ప్రోత్సాహం నిల్..

మండించినపుడు శక్తిని ఉత్పత్తి చేసే పదార్ధాన్ని ఇంధనం అంటారు. ఇంధన వాడకం నిత్యకృత్యం. వాహనాలు నడవడానికి, విద్యుత్ ఉత్పత్తి చేయడానికి, వంట చేయడానికి ఇలా ఇంధనం ఎన్నో రకాలుగా ఉపయోగ పడుతున్నది. మనం ప్రతిక్షణం ఎన్నోరకాల ఇంధనాలపై ఆధారపడి జీవిస్తున్నాం. నీరు, పెట్రోల్, డీజిల్, బొగ్గు, విద్యుత్, కట్టెపుల్లలు సహా ఎన్నో రకాల ఘన, ద్రవ, వాయు ఇంధనాలు, యురేనియం, థోరియం వంటి అణు రసాయన ఇంధనాలు నిత్య జీవితంతో పెన వేసుకుని పోయాయి. నిత్య జీవితంలో ఇంధనాలుగా ఉపయోగ పడుతున్నాయి. సంప్రదాయ ఇంధన వనరులైన బొగ్గు, పెట్రోల్, డీజిల్, అణు ఇంధనాలు ప్రకృతిలో పరిమితంగా మాత్రమే లభిస్తాయి. వాటిని ప్రస్తుతం వినియోగిస్తున్నట్లుగా విపరీతంగా వినియోగిస్తే ప్రమాదం తప్పదు. అవసరాలకు మించి వినియోగం చేస్తూ పోతే, భవిష్యత్తు అంధకారమే. అందుకే సంప్రదాయేతర ఇంధన వినియోగం ప్రత్యామ్నాయ మార్గంగా చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. పెట్రోల్ డీజిల్ గ్యాసులకు బదులుగా బయో ఇంధన వనరులను, బయోడీజిల్, బయో గ్యాస్ వంటి ఇంధన వనరులపై ఆధారపడడం వల్ల భవిష్యత్తు తరాలకు మేలు చేసినవారం అవుతాం. కొన్ని లక్షల సంవత్సరాల క్రితం భూమి అంతర్భాగంలో చేరి, భూమి లోపల విపరీతమైన ఉష్ణం, పీడనం కారణంగా మృత జీవజాలం నుండి శిలాజ నూనెలు/బొగ్గు ఏర్పడినవి. శిలాజ నూనెలు లేదా శిలాజ ఘన పదార్థాలను (నేల బొగ్గు వంటివి) తిరిగి సులభంగా పునరుత్పత్తి కావించుటకు సాధ్యం కాదు. అలా తిరిగి శిలాజ ద్రవ్యాలు ఏర్పడాలంటే మళ్లీ కొన్ని లక్షల సంవత్సరాలు పడుతుంది. అంటే శిలాజ ఇంధనాలను వాడే కొలది వాడి నిల్వలు తగ్గుతాయి కాని పెరగవు. 19వ శతాబ్ది నుండి శిలాజ ఇంధన వాడకం ప్రపంచ వ్యాప్తంగా పెరిగి పోయింది. పరిశ్రమల్లో బాయిలర్లలో, థెర్మోపవరు ప్లాంటు బాయిలరులో బొగ్గు వాడకం ఎక్కువ. పెట్రోలు, డీజిల్లను ఇంధనంగా వాడు వాహనాలు విపరీతంగా పెరిగిపోయాయి. అందువలన శిలాజ ఇంధనాల నిల్వలు త్వరగా కరిగి, తరిగి పోతున్నాయి. ఇలాగే శిలాజ ఇంధనాల వాడకం కొనసాగితే కొన్ని వందల సంవత్సరాల తరువాత శిలాజనిల్వలు తరిగి పోతూ, బైకులు, కార్లు, బస్సులు, ట్రక్కులు, విమానాలు, ఓడలు ఏవి కదలవు. మళ్ళీ మానవుడు ఎద్దుల బండ్లను, గుర్రపు బళ్ళను, సైకిళ్ళను వాడ వలసి వుంటుంది. కనుక కొంత మేరకు పెట్రోలియం ఇంధనాల వాడకం తగ్గించే నేపథ్యంలో ఈ జీవ ఇంధనాల వైపు ప్రపంచ దృష్టి మళ్ళింది. చెట్లగింజల నుండి తీసిన కొన్ని నూనెలు ఆహార యోగ్యం కాదు. ఉదాహరణకు వేప, కానుగ. జట్రోఫా (అడవి ఆముదం, నేపాళం) వంటి అనేక నూనెలు ఆహార యోగ్యం కాదు. ఈ నూనెలను అల్కహోలసిస్ అనబడు ఎస్టరిఫికేసన్ రసాయన చర్య ద్వారా బయోడీజిల్ గా పరివర్తించి,10% వరకు డీజిల్‌లో కలిపి డిజిల్‌ను ఇంధనంగా వాహనాల్లో వాడటం వలన డీజిల్ వాడకాన్ని చాలా వరకు తగ్గించవచ్చు. డీజిల్‌తో నడిచే వాహనాల్లోని అంతర్గత దహన యంత్రం యొక్క కార్బోరేటరులో తగు మార్పులు చేసిన నేరుగా బయోడిజిల్‌ను వాడవచ్చును. అలాగే డీజల్‌తో నడిచే రైలు ఇంజనులలో బయోడిజిల్‌ను వాడవటం వలన కూడా డీజల్ వాడకాన్ని గణనీయంగా తగ్గించ వచ్చు. పశువుల పేడ, మూత్రాలను ఉపయోగించి బయోగ్యాస్ ఉత్పత్తి కొన్ని దశాబ్దాలుగా ఉత్పత్తి చేస్తున్న విషయం తెలినదే. అలాగే ఏదైన జీవద్రవ్య ఘన ఇంధనాన్ని తక్కువ ఆక్సిజన్ అందేలా/లేదా ఆక్సిజన్ రహిత వాతావరణంలో 450ళీ%జ%వద్ద మండించడం వలన జీవ వాయు ఇంధనం ఏర్పడుతుంది. ఘనజీవ ద్రవ్య పదార్థాలను తాపవిచ్ఛేదన /ఉష్ణవిచ్ఛేదన కావించిన హైడ్రోజన్, కార్బన్ మోనాక్సైడ్, మిథేన్, ఈథేను, ఇథైలిన్ వాయువులు ఏర్పడుతాయి. ఈ వాయువులను కండెన్సరు/ద్రవీకరణకారి లోద్రవీకరించిన ద్రవ ఇంధనం/బయోడీజిల్ ఏర్పడుతుంది. భారత గత యూపీఏ కేంద్ర ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతి వ్యయం తగ్గించడం, వాతావరణ కాలుష్య నివారణకు, విలువైన విదేశీ మారక ద్రవ్యం మదింపుకోసం జీవ ఇంధనాల ఉత్పత్తులపై ప్రధానంగా దృష్టి నిలిపింది. ఇంధన భద్రతే విదేశాంగ విధానాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేస్తున్న ప్రస్తుత కాలంలో శిలాజ ఇంధనాల నిల్వలు రోజురోజుకూ అడుగంటి పోతున్న కారణంగా కాక, భూ ఉష్ణోగ్రత వ్యాకోచానికి దారి తీస్తున్న, బొగ్గు పులుసు వాయువుల విడుదలను అరికట్టడానికి, ప్రత్యామ్నాయ ఇంధన వనరులను అభివృద్ధి చేయడం అనివార్యంగా మన్మోహన్ సింగ్ ప్రభుత్వం భావించింది. శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా జీవ ఇంధనాలు (బయో ఫ్యూయెల్) అన్ని విధాలా లాభసాటిగా గుర్తించారు. శిలాజ ఇంధనం పెట్రోలు స్థానంలో, కర్బనం తక్కువగా ఉండే బయో డీజిల్ ప్రత్యామ్నాయ రవాణా ఇంధనంగా అభివృద్ధి చేసే దిశలో, ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో, బయో ఇంధన ఉత్పత్తులపై దృష్టి నిలిపింది. బయో డీజిల్ విపణి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని భావించి, నిర్ధారించి, చమురు ధరలు పెరిగిపోవడాన్ని దృష్టిలో ఉంచుకొని భారత దేశంలో బయో డీజిల్ అభివృద్ధికి పెద్ద ఎత్తున ప్రోత్సాహం అందించే దిశగా కృషి చేసింది. బయో డీజిల్ అనగా కానుగ (శాస్త్రీయ నామం: పెన్నేటి) గింజలు లేదా పెద్ద నేపాళం (జట్రోటా) గింజలనుండి తీసే నూనె. బయోడీజిల్ రెండు దశాబ్దాల క్రితమే గుర్తించినా, అది కార్యరూపం దాల్చడానికి చాలా సమయం పడుతున్నది. సస్టేనబుల్ ట్రాన్స్ఫర్మేషన్ ఆఫ్ రూరల్ ఏరియాస్ (సూత్ర) అనే సంస్థ బెంగళూరులో బయో డీజిల్ తయారీ, వినియో గంపై విస్తృత పరిశోధన జరిపింది. బంజరు భూములు అధికంగాగల భారతావనిలో జీవ ఇంధనాన్ని ఉత్పత్తి చేయడానికి పలు పెద్ద సంస్థలు ప్రయత్నించాయి. కానుగ సాగుకు ఎంతో సాంకేతిక పరిజ్ఞానం అక్కరలేదు. కానుగ చెట్లు నెలకు ఒకటి, రెండు తడులతో మామిడి చెట్లంత పెరుగుతాయి. గృహావరణాల్లో, రోడ్ల కిరువైపులా కానుగ నాటితే ఆహ్లాదకరమైన నీడతోపాటు, వేణ్ణీళ్ళకు చన్నీ ళ్ళ తోడు లాగా ఆదాయం పెరుగుతుంది. ఈ చెట్లు 5 సంవత్సరాలు కాపు ప్రారంభించి, 30 ఏళ్ళ వరకు పంట నిస్తాయి. కానుగ స్వయంగా చీడ పీడల నివారణి అయినందున దానిపై ఎటువంటి చీడ పీడలుండవు. నరేంద్ర మోడీ గత ప్రభుత్వం ఇటీవలి కాలంలో పునరుత్పాదక ఇంధన పథకాలకు విశేష కృషి చేసింది. స్వచ్ఛమైన శిలాజ ఇంధనాలను, పర్యావరణ హితమైన ఇంధనాలను తగిన పరిమాణంలో అందుబాటులో ఉంచుకోవడా నికి, అవి అందు బాటు యోగ్యంగా ఉండేలా చూడటానికి ప్రాధాన్యం ఇచ్చింది. దేశంలో సులభతర వాణిజ్య నిర్వహణకు ఎంతో చేయూత అందిస్తున్నది. స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులకు సదుపాయంగా ఉండేలా, అన్ని మంత్రిత్వ శాఖల్లో ప్రాజెక్ట్ అభివృద్ధి విభాగాలను విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విభాగాలను ఏర్పాటు చేసింది. ఇంధన పేదరికాన్ని అంతం చేసే దిశగా, స్వచ్ఛమైన శిలాజ ఇంధనాలను, పర్యావరణ హితమైన ఇంధ నాలను తగిన పరిమాణంలో అందుబా టులో ఉంచుకోవడానికి మార్గ నిర్దేశం చేసింది.

# ఆత్మవిశ్వాసమే ఆలంబనగా



**హైదరాబాద్,మార్చి,18,తెలంగాణ దిశ :** ఆమెకు చిన్నప్పటి నుంచి ఆటలంటే ఎంతో ఇష్టం. అందులోనూ రన్నింగ్, జాగింగ్, షటిల్, బ్యాడ్మింటెన్, ఖోఖో వంటి ఆటలను అవ లీలగా ఆడేస్తుంటారు. జాతీయస్థాయి అథ్లెటిక్స్‌లో అనేక పతకాలను కైవసం చేసుకున్నారు. ఓ వైపు చదువు, మరోవైపు క్రీడల్లోనూ రాణిస్తూ రెండు వైపులా రాటుదేలారు. చిన్నప్పటి నుంచే ఆమెకు పర్వతప్రాం తాల్లో పర్యటించటం ఎంతో ఇష్టం. అధిరోహించిన వారి వివరాలు తెలుసుకుంటూ ఉండేవారు. తను కూడా వారి మాదిరిగానే తయారు కావాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నారు. ఈ క్రమంలోనే ఇప్పటికే మనదేశంలోని అనేక పర్వతాలను అధిరోహిం చారు. తాజాగా దక్షిణ అమెరికాలోని అత్యంత ఎత్తయిన పర్వతం మోంట్ ఏకాంకాగ్వా (6962 మీటర్లను) ఆమె అధిరోహించి రికార్డు నెలకొల్పారు. ఆమె రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.భరణి. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన ఎస్.భరణి సివిల్ సర్వీసెస్ ద్వారా ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్ (ఐఎఫ్ఎస్)కు ఎంపికయ్యారు. పోస్టింగ్ రీత్యా ఆంధ్రప్రదేశ్‌కు ఐఎఫ్ఎస్ అధికారిణి హోదాలో శాప్ ఎండిగానూ, వైస్‌చైర్మన్‌గానూ, ఏపి యూత్ సర్వీసెస్ కమిషనర్, ఏపి సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ ఎంప్లాయిమెంట్ ప్రమోషన్ (స్టెప్) ఎండిగా కూడా ఆమె బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మోంట్ ఏకాంకాగ్వా శిఖరాన్ని అధిరోహించిన అధికారిణిగా ఆమె నిలిచారు. 2026, జనవరి 8న దక్షిణ అమెరికా అర్జెంటైనాలో ఉన్న మోంట్ ఏకాంకాగ్వా పర్వత శిఖరాన్ని అధిరోహించటానికి ఆమె బయలుదేరి వెళ్లారు. 19 రోజుల్లో ఈ శిఖరాన్ని అధిరోహించాలనే లక్ష్యాన్ని పెట్టుకోగా ఈనెల 20నే అంటే లక్ష్యానికి ఆరురోజులకు ముందుగానే ఆమె పర్వతారోహణ పూర్తిచేసేశారు. తీవ్రమైన మంచు, మంచుగడ్డలు విరిగిపడతాయనే హెచ్చరికల నడుమ, ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకుని ఆమె లక్ష్యాన్ని సాధించేందుకు ముందుకు సాగారు. ఈ ప్రయాణంలో కొన్నిసార్లు పడటం, కొన్ని దెబ్బలు తగలటం, నొప్పులతో ఇబ్బందులు పడిన ఉదంతాలు అనేకం ఉన్నాయి. తన ముందున్న లక్ష్యాన్ని సాధించాలనే తపన ముందు అవేమీ అడ్డంకి కాలేదు. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగారు. అథ్లెటిక్‌గా తనకున్న ప్రావీణ్యం కూడా ఈ శిఖర అధిరోహరణకు దోహదపడింది. పాఠశాలస్థాయిలోనే ఆమె ఆటలంటే ఎంతో ఇష్టం. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రాక్టీస్ చేసేవారు. పరుగుపందెం పోటీలన్నింటిలోనూ పాల్గొని తన సత్తా చాటేవారు. మిగతా ఆటల్లోనూ చురుగ్గా పాల్గొనే వారు. లాంగ్‌జంప్, హైజంప్, స్విమ్మింగ్, సైక్లింగ్, రేస్ వాకింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి పలు బహుమతులను అందు కున్నారు. అథ్లెటిక్స్‌లో జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జా తీయ స్థాయి పోటీల్లో పాల్గొని పలు పతకాలను సైతం కైవసం చేసుకున్నారు. ప్రాథమిక విద్యాభ్యాస మంతా కోయంబత్తూరులోనే సాగింది. పోస్టు గ్రాడ్యుయేషన్ తర్వాత ఆమె సివిల్స్ రాసి అందులో ర్యాంకు సాధించి ఉన్నత హోదాలో నిలిచారు. ఆత్మవిశ్వాసమే ఆయుధంగా: 'ఓడిపోతామనే భయంతో ప్రయత్నించక పోవటం కంటే..ప్రయత్నించి ఓడిపోవడమే మేలు' అన్న స్వామి వివేకానంద స్ఫూర్తిని ఆమె తీసు కున్నారు. 'అడుగేయాలి.. ముళ్లమా ర్గాన్ని అన్వేషిం చాలి.. అలుపొస్తున్నా కలలే కన్నా. అనుకున్నది అధిరోహించాలి' అంటూ చంద్రబోస్ రాసిన పాటే ప్రేరణగా ఆమె ముందుకు సాగుతున్నారు. పర్వతారోహణ లక్ష్యాన్ని ఎంచుకున్నప్పుడు భరణి మొదట్లో భయపడ్డారు. నేను ఇది 'సాధించగలనా?' అని కొద్దిగా సంకోచించారు. ఆతర్వాత ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకుని ఆమె లక్ష్యసాధన కోసం అహరహం కష్టపడ్డారు. తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు కూడా తను ఎంచుకున్న లక్ష్యానికి అడ్డు చెప్పలేదు. ఉదయం, సాయంత్రం నడకకు వెళ్లేవారు. సాహస కృత్యాలు చేయటం కూడా చిన్నప్పటి నుంచే ఆమెకు అలవాటు. కోవిడ్ సమయంలో ఖాళీ సమయాల్లో ఏదో ఒకటి సాధించాలనే కుతూహలంతో పర్వతారోహణపై ఆసక్తి పెంచుకున్నారు. కోయంబత్తూరు పరిసర ప్రాంతాల్లోని కొండలను కొన్ని సార్లు ఎక్కారు. ఆ తర్వాత హిమాలయాల్లోని కొండలను తిలకించి ఎక్కేశారు. ఆ తర్వాత కొండంత ఆత్మవిశ్వాసాన్ని ప్రోగుచేసుకుని ప్రపంచంలోనే ఎత్తయిన పర్వత శిఖరాలను అధిరోహించాలనే లక్ష్యాన్ని రూపొందించుకున్నారు. మైనస్ 18 నుంచి 20 డిగ్రీల ఉష్ణోగ్రతలను తట్టుకుంటూ లోయలాంటి ప్రదేశాల్లో పడిపోకుండా అత్యంత జాగ్రత్తగా అడుగులు వేయటాన్ని ప్రాక్టీస్ చేశారు.

పర్వత శిఖరాలకు వెళ్లి అక్కడి చలి పరిస్థితులను తట్టుకునేలా కొన్ని రోజుల పాటు శిఖరారోహణ క్రమంలో ప్రాక్టీస్ చేశారు. అధిరోహించటానికి వెళ్లిన సందర్భాల్లో తట్టుకోలేక కన్నీళ్లు పెట్టుకున్న సందర్భమూలు అనేకం ఉన్నాయి. అర్జంటైనాలో 12 రోజులపాటు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ట్రెక్కింగ్ కూడా కొనసాగింది. సమ్మిట్ పుష్‌కు బయలు దేరి ఆ తర్వాత శిఖరాన్ని చేరుకున్నారు.

పర్వతాలను అధిరోహించటమే లక్ష్యంగా: ముందుగా ప్రపంచంలోని ఎత్తయిన కొండల గురించి తెలుసుకుని ఆ తర్వాత వాటిని అధిరోహించేందుకు ఉన్న అవకాశాలు, ఇబ్బందులు, అక్కడి వాతావరణ పరిస్థితులు వంటి వాటిని తెలుసు కున్నారు. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని డార్జిలింగ్‌లోని హిమాలయ మోంటేనీరింగ్ ఇనిస్టిట్యూట్‌లో 30 రోజులపాటు పర్వతారోహణపై శిక్షణ పొందారు. 2022లో జమ్మూకాశ్మీర్‌లోని లడ్డాఖ్‌లో పర్వతారోణను కొద్దిరోజులపాటు చేశారు. ఆ తర్వాత 2024లో ఆఫ్రికా ఖండంలో ఎత్తైన కిలిమంజారో పర్వతం ఎక్కి అక్కడ భారత జాతీయ జెండాను ఎగరేశారు. మిగతా ఐదు పర్వతాల అధిరోహణ చేసి చరిత్రలో నిలిచిపోవాలనేది ఆమె తాపత్రయం. ధైర్యసాహసాలతో: ఆమె పర్వతారోహణలో సాధించిన విజయాలు నిజంగా అసాధారణమైనవి. 2022లో లడఖ్ ప్రాంతంలోని 20 వేల అడుగులున్న రెండు ఎత్తైన శిఖరాలను అధిరోహించడమే కాకుం డా, అరుణాచల్ ప్రదేశ్‌లోని మోంట్‌గోరిచెన్ (21,286 అడుగులు) శిఖరాన్ని కూడా విజయవంతంగా ఎక్కారు. 2024లో రష్యాలోని మోంట్ ఎల్బ్రస్ (18,350 అడుగులు) శిఖరాన్ని జయించడంతో పాటు, లడఖ్‌లోని ఉట్‌కాంగ్రి, కాంగ్‌యాట్సే శిఖరాలనుకూడా అధిరో హించి తన సాహసిక ప్రతిభను మరోసారి చాటుకున్నారు. మొత్తంగా ఆమె కాంగ్ యాట్సే, రెనాక్, కిలిమంజారో, ఎల్బ్రస్, మోంట్ ఏకాంకాగ్వా పర్వతాలను అధిరోహించిన మహిళగా గణతికి ఎక్కారు. మరిన్ని పర్వతాలను అధిరోహిస్తా: ఇప్పటికే పలు పర్వతాలను అధిరోహించా. రాబోయే రోజుల్లో ప్రపంచంలోనే మరిన్ని ఎత్తయిన పర్వతాలను అధిరోహించటమే లక్ష్యంగా కృషిచేస్తున్నా. మోంట్ ఏకాంకాగ్వా పర్వతాన్ని అధిరోహించే క్రమంలో కొన్ని వాతావరణ పరిస్థితులతో ఇబ్బందులు పడ్డా. అయినా మంచు చరియలు విరిగిపడతాయనే సూచనలు రావటంతో 19 రోజుల లక్ష్యాన్ని కేవలం 12 రోజుల్లో పూర్తిచేశా. భవిష్యత్తులో 8000 మీటర్లపైబడి లక్ష్యాన్ని అధిరోహించటమే లక్ష్యంగా పెట్టుకున్నా.

# అంతర్జాతీయ మార్కెట్‌లో భారత్ పైచేయి

**హైదరాబాద్,మార్చి,18,తెలంగాణ దిశ:** భారత ఆర్థిక వ్యవస్థ అంతర్జాతీయ స్థాయిలో ఒక నూతన శకాన్ని ఆరంభించింది. ప్రపంచవ్యాప్తంగా అగ్రగామి దేశాలతో వరుసగా కుదుర్చుకుంటున్న వాణిజ్య ఒప్పందాలతో భారత్ తన ఆర్థిక వ్యూహాన్ని పూర్తిగా మార్చేస్తోంది. ముఖ్యంగా అమెరికాతో కుదిరిన తాజా చారిత్రక వాణిజ్య ఒప్పందం భారత్ ఆర్థిక చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపో నుంది. ప్రపంచ స్థూల దేశీయ ఉత్పత్తిలో సగానికి పైగా వాటా కలిగిన దేశాలతో భారత్ ప్రస్తుతం వాణిజ్య బంధాలను కలిగి ఉండటం ఇక్కడ గుర్తించాల్సిన విషయం. కేవలం కొన్ని రోజుల వ్యవధిలోనే రెండు కీలకమైన అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలపై సంతకాలు చేయడం ద్వారా దేశం తన వ్యూహాత్మక దౌత్యాన్ని అనుసరిస్తోంది.భారత్, అమెరికా మధ్య ట్రేడ్ డీల్ కు అంగీకారం జరిగిన తరువాత రష్యా చమురు కొనుగోలు హాట్ టాపిక్ అవుతోంది. అయితే రష్యా ముడి చమురును కొనడం పూర్తిగా ఆపివేయడం వల్ల ఇండియాకు సమస్యలు ఏర్పడవచ్చు. రేటింగ్ ఏజెన్సీ మూడీస్ తన నివేదికలో, భారత్ ఇటీవల నెలల్లో రష్యా నుండి ముడి చమురును కొనడం క్రమంగా తగ్గించిందని పేర్కొంది. అందుకు అమెరికానే కారణం అని తెలిసిందే. అయితే పూర్తి కొనుగోళ్లను ఒక్కసారిగా నిలిపివేస్తే ఆర్థికాభివృద్ధికి చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. ఇది దేశంలో సరఫరా లోటుకు కారణంగా మారవచ్చు. చమురు ధరలు పెరిగి ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపవచ్చు అని కొందరు నిపుణులు అంచనా వేశారు. ఎందుకంటే భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద చమురు దిగుమతిదారులలో ఒకటి.అమెరికాతో డీల్ కోసం భారత్ కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది. రష్యా నుంచి కాకుండా ఇతర దేశాల నుంచి చౌక ధరకు ముడి చమురు కొనడం సవాల్‌గా మారనుంది. ఇది ప్రపంచ వ్యాప్తంగా ధరల పెరుగుదలకు కారణం అవుతుందని, భారత్ వంటి అతిపెద్ద దిగుమతి చేసుకునే దేశంలో ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉందని మూడీస్ స్పష్టంగా పేర్కొంది. ఆర్థికాభివృద్ధిలో ఇబ్బందులను నివారించడానికి భారతదేశం వెంటనే అన్ని రష్యా నుంచి ముడి చమురు కొనుగోళ్లను ఆపివేసే అవకాశం లేదని ఏజెన్సీ తెలిపింది.అమెరికా భారత వస్తువులపై టారిఫ్ 50 శాతం నుండి 18 శాతానికి తగ్గించిన వాణిజ్య ఒప్పందం కోసం వచ్చింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత్ త్వరలో రష్యా చమురును కొనడం ఆపివేస్తుందన్నారు.

ఇకనుంచి వెనిజులా నుండి ఎక్కువ చమురును కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. భారత్ అమెరికా నుండి 500 బిలియన్ డాలర్లకు పైగా ఉత్పత్తులను కొనుగోలు చేస్తుందని, ఇందులో ముడి చమురు కూడా ఉంటుందని ట్రంప్ అన్నారు. అయితే, ప్రధాని మోదీ మాత్రం టారిఫ్ తగ్గించడంపై మాత్రమే మాట్లాడారు. కానీ రష్యా చమురును ఆపివేయడం గురించి స్పష్టత ఇవ్వలేదు. రష్యా చమురు కొనుగోలు కారణంగా విధించిన అదనపు 25 శాతం పెనాల్టీ సుంకాన్ని తొలగించారని, అలాంటి కొనుగోళ్లను ఆపివేయడానికి భారత్ అంగీకరించిందని వైట్ హౌస్ అధికారి పేర్కొన్నారు.

# విమాన ప్రమాదాలకు అంతం ఎప్పుడు




**హైదరాబాద్,మార్చి,18,తెలంగాణ దిశ :**ఆది అంతమూ లేని ఆకాశాన్ని.. అసలైన స్వేచ్ఛకు ప్రతీకగా మనం భావిస్తూ ఉంటాం. అయితే.. సమున్నతంగా, అనంతంగా వ్యాపించిన ఆ నీలి ఆకాశమే.. జాతిని ముందుకు నడపాల్సిన విలువైన వ్యక్తులను నిర్దాక్షిణ్యంగా చిదిమేసినప్పుడు కలిగే దుఃఖం మాటల్లో చెప్పలేనిది. తనను నమ్ముకున్న అనుచరులు పోటీ చేస్తున్న చోట ప్రచారానికో, దగాపడిన ప్రజలకు ధైర్యం చెబుదామనో, దేశప్రగతిని పట్టాలెక్కించే మరో కార్యక్రమం కోసమో.. విమానంలోనో, హెలీకాప్టర్‌లోనో బయలుదేరిన నేతలు ప్రమాదాల వల్ల ప్రాణాలు కోల్పోయినప్పుడు.. అది చెప్పలేని విషాదంగా పరిణమిస్తుంది. దేశ గమనాన్ని మార్చి, కోట్లాది జాతిజనుల కలలకు ప్రతీకలుగా నిలిచిన ఆ వ్యక్తులు ఈ ప్రపంచం నుంచి మాయమైన తీరు.. ఒక తరానికి పీడకలగానే నిలిచిపోతుంది. భారతప్రజాస్వామ్య చరిత్రలో అలాంటి అత్యంత విషాదకరమైన పీడకలలు ఎన్నో ఉన్నాయి. అశేష ప్రజానీకానికి ఆరాధ్య దైవాలుగా నిలిచిన ఆ నేతల చివరి ప్రయాణాలను తలచుకుంటే.. నేటికీ గుండె బరువెక్కక మానదు. ఈ జాబితాలో ప్రజల మనసులు గెలిచిన నాయకుల నుంచి అన్ని రంగాల ప్రముఖులూ ఉన్నారు. విమాన ప్రమాదాలు అనగానే తెలుగువారికి ముందుగా కొన్ని పేర్లు గుర్తుకు వస్తాయి. వారిలో యలవర్తి నాయుడమ్మ ఒకరు. చిన్న రైతు కుటుంబంలో పుట్టిన నాయుడమ్మ అంతర్జాతీయ స్థాయి రసాయన శాస్త్రవేత్తగా ఎదిగారు.అప్పట్లో ప్రధానమంత్రిగా ఉన్న ఇందిరాగాంధీకి సలహాదారుగా పనిచేసిన ఆయన, ఐక్యరాజ్యసమితితోపాటు పలు అంతర్జాతీయ సంస్థలకు, విదేశీ సంస్థలకు కూడా సలహాదారుగా పనిచేశారు. కెనడాలోని ఐడిఆర్‌సి సమావేశానికి హాజరై 1985 జూన్ 23న తిరిగి వస్తున్న క్రమంలో ఆ ఎయిర్ ఇండియా పేలిపోవటంతో కన్నుమూశారు. ఈ వార్త వినగానే.. ఆయన భార్య డాక్టర్ పవన ఆత్మహత్య చేసుకుని మరణించటం మరో విషాదం. ఇలాంటి విషాద వార్తలు వినగానే తెలుగువారికి ఏపి మాజీ సిఎం రాజశేఖరరెడ్డి, నాటి లోక్‌సభ స్పీకర్ జిఎంసి బాలయోగి, సినీ నటి సౌందర్య మరణాలు గుర్తుకు రాకుండా ఉండవు. లోక్‌సభ మాజీ స్పీకర్, టిడిపి నేత జిఎంసి బాలయోగి 2002 మార్చి 3న హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. భీమవరం నుంచి బయలుదేరిన ఆయన ప్రయాణిస్తున్న ప్రైవేట్ హెలికాప్టర్, కృష్ణా జిల్లా కైకలూరు సమీపంలోని ఓ చెరువులో కూలిపోయింది. సరిగ్గా రెండేళ్ల తర్వాత తెలుగువారికి ఎంతో సుపరిచితురాలైన ప్రముఖ సినీ నటి సౌందర్య 2004 ఏప్రిల్ 17న జరిగిన విమాన ప్రమాదంలో మృతి చెందారు.

ఇక.. తెలుగు రాష్ట్రాల ప్రజల జనహృదయ నేతగా పేరు తెచ్చుకున్న నేత దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 14 వ సిఎంగా పనిచేసిన వైఎస్ఆర్.. 2009, సెప్టెంబర్ 2న నల్లమల అడవుల్లో హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. ఆయన మరణం తెలుగు రాష్ట్రాల ప్రజలను తీవ్రంగా కలచివేసింది. విమాన ప్రమాదంలో దేశం కోల్పోయిన మరో మేధావి హోమీ జహంగీర్ బాబా. 1966 జనవరి 24న జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదంలో ఈ ప్రపంచ ప్రఖ్యాత అణుశాస్త్రవేత్త అకాల మరణం చెందారు. 1980 జూన్ 23న మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ కుమారుడు సంజయ్ గాంధీ విమాన ప్రమాదంలో మృతి చెందారు. ఢిల్లీ ఫ్లయింగ్ క్లబ్‌కు చెందిన విమానాన్ని నడుపుతూ, ప్రమాదకర విన్యాసాలు చేయడానికి ప్రయత్నించగా, విమానం కూలిపోయింది. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ కేంద్రమంత్రి మాధవరావు సింధియా 2001 సెప్టెంబర్ 30న విమాన ప్రమాదంలో మృతి చెందారు.

# యాంటీ బయోటిక్స్ అవసరానికి మించితే ఆరోగ్యముప్పు..!



**హైదరాబాద్,తెలంగాణ దిశ:** జలుబు..దగ్గు.. జ్వరాలు.. ఇలా అన్నింటికీ అవసరం ఉన్నా.. లేకపోయినా యాంటీ బయోటిక్స్ వాడడం మంచిది కాదు. సాధారణంగా తగ్గిపోయే వాటికి కూడా మందులు వాడేస్తుండటంతో శరీరం రోగ నిరోధక శక్తిని కోల్పోయి జీవచ్ఛవంలా మారుతోంది. అధిక ఉత్పత్తి కోసం కోళ్లు, చేపలు, రొయ్యలు పెంపకంలో యాంటీ బయోటిక్స్‌ను అధికంగా వినియోగిస్తున్నారు. వీటిని ఆహారంలోకి తీసుకున్నప్పుడు యాంటీబయోటిక్స్ కూడా మన శరీరంలోకి చేరుతున్నాయి. ప్రజారోగ్యం బాగుపడాలన్నా, శరీర రోగాలను తట్టుకుని, ఎదుర్కొనే సామర్థ్యం ఉండాలన్నా యాంటీబయాటిక్స్ వాడకంతగ్గించాలి. యాంటీబయోటిక్స్ రెసిస్టెన్స్ ప్రపంచంలో ఆరోగ్యానికి పెరుగుతున్న పెను ముప్పుగా గుర్తించాలి. దశాబ్దాలుగా యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్ (ఎఎంఆ ర్) ప్రపంచ ఆరోగ్యానికి గణనీయమైన ముప్పుగా ఉంది. యాంటీబ యాటిక్స్ అనేవి ప్రాణాధార మందులు. అవి ఇన్ఫెక్షన్ కల్గజేసే సూక్ష్మజీవులపై పనిచేస్తేనే ప్రాణాలను కాపాడతాయి. వైద్యచికిత్సలో ఔషధాలు మోతాదు మించి వాడితే అనర్థాలు చోటుచేసుకుంటా యి. యాంటీబయాటిక్ వాళ్లకు తోచిన విధంగా ఉపయోగించడం వల్ల సూక్ష్మక్రిములు నిరోధకతను పెంచుకుని ప్రాణాంతకంగా మారుతుంటాయి. యాంటీబయాటిక్ మందులు వేసినా కూడా సూక్ష్మజీవులు చనిపోవడానికి బదులు ఇంకా పెరుగుతూనే ఉండే పరిస్థితిని ఎఎంఆర్‌గా చెబుతాం. ఎంఆర్‌కి రాజధానిగా మనదేశం ఉందంటే ఆశ్చర్యం కలుగకమానదు. 2019లోప్రపంచవ్యాప్తంగా 5 మిలియన్లు,మనదేశంలో పది లక్షల మంది వరకూ చనిపోయారు. రోజుకు 3500 మంది మరణిస్తున్నా రనేది అంచనా. 2025 నుంచి 2050 నాటికి 40 మిలియన్ల మరణాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. 2050 తర్వాత ఏడాదికి 1.91 మిలియన్ మంది చనిపోయే ప్రమాదం ఉంది. యాంటీబయాటిక్స్ మన ఆరోగ్యానికి అత్యంత ప్రమాదంగా మారుతున్నాయి. కరోనా తర్వాత పరిణామాల్లో ప్రస్తుత సమాజంలో వీటి వినియోగం విపరీతంగా పెరిగింది. జలుబు, దగ్గు, జ్వరం వంటి చిన్న అనారోగ్య సమస్యలకు కూడా వీటిని ఉపయోగిస్తున్నారు. సాధారణంగా వ్యాధికారక బాక్టీరియా, వైరస్‌లు మొదలైన వాటి వల్ల కలిగే వ్యాధుల చికిత్సకు యాంటీబయాటిక్స్ ఉపయోగిస్తారు. 'సూపర్ బగ్స్' యాంటీబయాటిక్స్‌ను నిరోధిస్తాయి. యాంటీ బయాటిక్స్ ఎక్కువగా, అనవసరంగా తీసుకునే వ్యక్తుల శరీరంలో ఈ రకమైన సూపర్‌బగ్స్ కనిపిస్తాయి. ఎందుకంటే శరీరం నిరంతరం యాంటీబయాటిక్స్‌కు గురైనప్పుడు, మన శరీరం క్రమంగా దానితో పోరాడటానికి ఒక రక్షణ యంత్రాంగాన్ని అవలంబిస్తుంది. దీంతో ఎంత యాంటీబయాటిక్స్ వాడినా శరీరం వాటికి సరిగా పనిచేయదు. గ్రామీణ ప్రాంతాల్లో యాంటీబయోటిక్స్ వినియోగం అనేక అనారోగ్య సమస్యలకు, ఆరోగ్య ప్రమాదాలకు కారణంగా మారుతోంది. సరైన ప్రిస్క్రిప్షన్ లేకుండా యాంటీబయా టిక్స్ కొనుగోలు చేసి, వాటిని ఉపయోగిస్తుండటంతో దుష్పరిణా మాలు వస్తున్నాయి. యాంటీబయోటిక్స్ డోసు తెలియకుండా చిన్న అనారోగ్యాలకు సైతం చాలా ఎక్కువగా వాడేస్తుండటం ఏమాత్రం సరికాదు. ఇది కూడా వారిలో రెసిస్టెన్స్‌కు కారణమౌతోంది. దీనివల్ల భవిష్యత్తులో యాంటీబయాటిక్స్ ఉపయోగిస్తే పనిచేయని పరిస్థితి (ఎఎంఆర్) చోటు చేసుకుంటుంది. మనకు తెలియకుండానే శరీరంలో వివిధ సైడ్ ఎఫెక్ట్స్‌కు కారణమవుతున్నాయి.

**మితిమీరితే ప్రజారోగ్యానికీ ప్రమాదం:**
యాంటీమైక్రోబయాల్ రెసిస్టెన్స్ అనేది సహజమైన అంశం. మానవులు, జంతువులు, మొక్కల్లో యాంటీబయాటిక్స్ మితిమీరిన వినియోగం, దుర్వినియోగం సమస్యను మరింత తీవ్రతరం చేసింది. వినియోగం వల్ల వచ్చే సమస్యలను క్లిష్టంగా మారిన తర్వాత పరిష్కరించడం కష్టమవుతుంది.

యాంటీబయాటిక్ మందులు వేసినా కూడా సూక్ష్మజీవులు చనిపోవడానికి బదులు ఇంకా పెరుగుతూనే ఉండే పరిస్థితి (ఎఎంఆర్) ఉంటుంది. వైద్యులు సరైన యాంటీబయాటిక్, సరైన డోసులో,సరైన కాలం పాటు, సరైన సమయంలో ఇవ్వాలి. వీలైనంత తక్కువకాలం పాటు యాంటీబయాటిక్స్ వాడడమే సరైన వ్యూహం. ఇన్ఫెక్షన్లకు సరైన చికిత్స చేయడం వల్ల యాంటీబయాటిక్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలు తగ్గుతాయి, యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ రాదు. మల్టీ డ్రగ్ రెసిస్టెన్స్, ప్యాన్ డ్రగ్ రెసిస్టెన్స్, ఎక్స్‌టెండెడ్ రెసిస్టెన్స్ వల్ల ఎక్కువ మరణాలు సంభవిస్తాయి.

**దుష్పరిణామాలు అనేకం:** కొన్ని రకాల యాంటీబయాటిక్స్ సైడ్ ఎఫెక్ట్స్ కారణమవుతాయి. వాంతులు, విరోచనాలు, వికారం, ఎలర్జీ వంటి ఇతర సమస్యలకు కూడా కారణమవుతాయి. ఇక అవసరం లేనప్పుడు యాంటీబయాటిక్స్ వాడడం అనవసరమైన ఆరోగ్య సమస్యలకు కారణమవుతుంది. నిజంగా అవసరమైనప్పుడు సరిగ్గా పనిచేయని పరిస్థితి వస్తుంది. ఇది అనవసరమైన వైద్య ఖర్చులకు కారణంగా మారుతుంది.

**అవగాహన ముఖ్యం:**
గ్రామీణ ప్రాంతాల్లో యాంటీబయాటిక్స్ వాడకంపై ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలి. ఆయా ప్రాంతాల్లో వైద్య సేవలను మెరుగుపరిచి, మెడికల్ షాపుల్లో నేరుగా మందులు ఇచ్చే విధానాన్ని అరికట్టాలి. వైద్య సలహా లేకుండా యాంటీబయాటిక్స్ వాడకుండా నిరోధించేలా చర్యలు తీసుకోవాలి.

**శృతిమించితే ప్రమాదం:**
మందులు సమర్థంగా ఇన్ఫెక్షన్లను నియంత్రించలేకపోతే ప్రాణాధార చికిత్సలైన కేన్సర్ చికిత్స,అవయవ మార్పిడి లాంటి వాటిపై ఎఎంఆర్ ప్రభావం చూపుతుంది. చెప్పిన డోస్ కంటే తక్కువ కాలం వాడడం,లేదా తగిన డోసేజిలో వాడకపోవడం ఒక వ్యాధికి సరిపడని మందు వాడడం లాంటివే. వైద్యులుచెప్పినట్లే వీటిని వాడాలి. వేరేవారికి రాసిన మందులు వాడితే నయమైపోతుందని అనుకోకూడదు. ఆయా వ్యక్తులు ఆరోగ్యరీత్యా తగిన మందులను సరైన డోసులోనే తీసుకోవాలి. మన దేశంలో నేరుగా దుకాణాలకు వెళ్లి ఏదిపడితే ఆ యాంటీబయాటిక్ కొనుక్కునే అవకాశంఉండడం కూడా వీటి దుర్వినియోగానికి కారణం అవుతోంది. కొత్త యాంటీబయాటిక్స్ తయారీ చాలా సమస్యాత్మకం. ఖర్చుతో కూడుకున్నది. మార్కెట్లోకి రావడానికి చాలా సమయం పడుతుంది. దీనివల్ల కొత్త రకాల యాంటీబయాటిక్స్ తగ్గుతున్నాయి. అందుకని ఉన్నవాటినే జాగ్రత్తగా కాపాడుకోవాలి. చాలావరకు టీకాలు బ్యాక్టీరి యల్ ఇన్ఫెక్షన్లను నిరోధిస్తాయి ఎఎంఆర్ సమస్య పరిష్కారానికి పిల్లలు, పెద్దలు, వృద్ధులు టీకాలు తీసుకోవడం చాలా ముఖ్యం. ఎవరికైనా ఇన్ఫెక్షన్ రాకపోతే యాంటీ బయాటిక్స్ వాడాల్సిన అవసరమే ఉండదు.

# భారీగా పెరిగిన ఫారెక్స్ నిల్వలు




ముంబై: మనరూపాయి విలువ కొన్ని రోజులుగా ఆల్‌టైమ్ కనిష్టస్థాయి పడిపోయింది. 90 మార్కును తాకింది. దీంతో మన ఎగుమతులపై ప్రభావం పడుతోంది. అయితే ఇదే సమయంలో మన ఫారెక్స్ నిల్వలు పెరిగాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకారం, డిసెంబర్ 5తో పూర్తయిన వారంలో విదేశీ మారక నిల్వలు 1.033 బిలియన్ డాలర్ల వృద్ధితో 687.26 బిలియన్ డాలర్లకు చేరాయి. ముఖ్య కారణం బంగారం నిల్వలు 1.19 బిలియన్ డాలర్లు కలుపుకుని 106.98 బిలియన్ డాలర్లకు చేరాయి. అయితే, ప్రధాన భాగమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 151 మిలియన్ డాలర్లు క్షీణించి 556.88 బిలియన్ డాలర్లకు తగ్గాయి. ఈ నిల్వలు సెప్టెంబర్‌లోని చారిత్రక గరిష్ఠం 704.89 బిలియన్ డాలర్లకు సమీపంలో ఉండి, 11 నెలల దిగుమతులను పుదినపెట్టే స్థితిలో ఉన్నాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీలను 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 3.5?3.75%కి నిర్ణయించడంతో ప్రపంచవ్యాప్తంగా బంగారం, వెండి రేట్లు గణనీయంగా పెరిగాయి. అంతర్జాతీయ స్పాట్ గోల్డ్ ధర డిసెంబర్ 12 నాటికి ఔన్స్‌కు 4,338 డాలర్లకు చేరి ఏడు వారాల శిఖరాన్ని తాకింది. భారతదేశంలో 24 క్యారట్ బంగారం గ్రాముకు రూ. 13,321కు ట్రేడైంది. రూపాయి మృదుత్వం, పెట్టుబడుల ఆకర్షణ కొనసాగడం ఈ ధరలకు మంచి మద్దతుగా నిలిచాయి. దేశీయ వెండి ధరలు వేగవంతమైన పునరుద్ధరణ చూపుతున్నాయి. గ్రాముకు రూ. 204.10 (కిలోకు రూ. 2,04,100)గా నమోదైంది. వారం క్రితం రూ. 1.87 లక్షల నుంచి గణనీయ పెరుగుదల నమోదైంది. సౌర శక్తి, ఎలక్ట్రిక్ వాహనాలు, ఎలక్ట్రానిక్స్ రంగాల డిమాండ్, సరఫరా కొరతలు ఈ ర్యాలీకి కారణాలు.డాలర్‌తో పోలిస్తే రూపాయి 90 మార్క్‌ను దాటి 2025లో 5%కి అధికంగా క్షీణించి ఆసియా బలహీన కరెన్సీగా మారింది. ఇది దేశీయ లోహ ధరలను మరింత భారీగా చేస్తోంది. అయినప్పటికీ, ప్రపంచ ఆర్థిక అస్థిరతల్లో పెట్టుబడిదారులు ఈ లోహాలను సురక్షిత ఆస్తులుగా ఎంచుకుంటున్నారు.

# ఇక ఎమ్మెల్సీయేనా..?

**విజయవాడ,తెలంగాణ దిశ:** జనసేన ఎమ్మెల్సీ నాగబాబుకు మంత్రి పదవి ఇస్తామ ని ప్రకటించి ఏడాదవుతుంది. గత ఏడాది ఈ ప్రకటన విడుదలయింది. చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో ఒక మంత్రి పదవి ఖాళీగా ఉండటంతో అది నాగబాబుకేనని జనసేన నేతలు ఫిక్స్ అయ్యారు. కానీ ఏడాది నుంచి నాగబాబు మంత్రి పదవి కోసం వెయిట్ చేస్తూనే ఉన్నారు. కానీ ఇంత వరకూ ఎలాంటి నిర్ణయం వెలువడలేదు. దీంతో నాగబాబు కూడా పెద్దగా యాక్టివ్ గా పాలిటిక్స్ లో కనిపించడం లేదంటున్నారు. నాగబాబుకు మంత్రి పదవి దక్కుతుందని ఇటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, అటు పవన్ కల్యాణ్ కూడా ప్రకటించారు. మీడియా సమావేశంలోనే వారు వివరించారు.కానీ ఏడాది గడుస్తున్నా నాగబాబుకు మంత్రి పదవి దక్కకపోవడానికి కారణం పవన్ కల్యాణ్ మాత్రమేనని చెబుతున్నారు.నాగబాబుకు మంత్రి పదవిపై పవన్ కల్యాణ్ క్లారిటీ కూడా ఇచ్చారు. తానే మంత్రి పదవిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందని చెప్పారు. నాగబాబుకు మంత్రి పదవి ఇచ్చేవిషయంపై ఇప్పటి వరకూ చర్చ అంటూ ఏమీ జరగలేదని తెలిపారు. చంద్రబాబు నాయుడు తీసుకోవాల్సిన నిర్ణయం తీసుకున్నారని, కానీ తాను మాత్రమే దీనిపై ఆలోచిస్తున్నానని చెప్పడంతో పవన్ కల్యాణ్ నిర్ణయం వవల్లనే నాగబాబుకు మంత్రి పదవి ఆగిందని అనుకోవాలి. ఆగస్టులో ఉండవచ్చని పవన్ కల్యాణ్ అప్పుడే చెప్పినా ఆగస్టు ముగిసి నాలుగు నెలలవుతున్నా ఇంకా కార్యరూపం దాల్చలేదు. ఇక నాగబాబుకు మంత్రి పదవి దక్కే అవకాశం కనిపించడం లేదు. కుటుంబంలోని వారికే పదవులు ఇస్తున్నారని, ఒకే సామాజిక వర్గానికి పదవులను పంచుతున్నారన్న విమర్శలను ఎదుర్కొనాల్సి వస్తుందని పవన్ కల్యాణ్ వెనకడగువేస్తున్నారంటున్నారు.

ఇప్పటికే జనసేనకు చెందిన ముగ్గురు మంత్రులుంటే అందులో ఇద్దరు కాపు సామాజికవర్గానికి చెందిన వారే. శాసనమండలిలో ఉన్న ఇద్దరు కూడా కాపు సామాజికవర్గానికి చెందిన వారే. ఇక మరో మంత్రి పదవి కూడా కాపు సామాజికవర్గానికి ఇస్తే తనపై కుల ముద్ర పడుతుందేమోనని పవన్ కల్యాణ్ ఆలోచనలో పడి నాగబాబుకు మోకాలడ్డినట్లు అంటున్నారు.

మరొకవైపు నాగబాబు అవసరం పార్టీకి ఉంటుందని కూడా పవన్ కల్యాణ్ అభిప్రాయప డుతున్నారు. అందుకే నాగబాబు ఎమ్మెల్సీతో సరిపెట్టుకోవాల్సి ఒదేనని జనసేన వర్గాలే చెబుతున్నాయి.

# టార్గెట్ 160 దిశగా విజయ్ వ్యూహాలు

చెన్నై: తమిళనాడులో ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజకీయ పార్టీలు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. అందులోనూ ఇటీవల పార్టీని ఏర్పాటు చేసిన నటుడు విజయ్ మరింత స్పీడ్ పెంచారు. పార్టీ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై నిర్ణయాల కోసం కమిటీలను నియామకం జరిగింది. తమిళనాట డీఎంకే పార్టీకి తానే ప్రత్యామ్నాయం అని నిరూపించుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఎండీఎంకే పార్టీకి బలంగా ఉన్న కొంగు మండలం ప్రాంతంలో పాగా వేసి వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తున్నారు.తమిళనాడులో 2026 తొలి త్రైమాసికంలో ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికలకు కొద్ది నెలలే ఉండడంతో రాజకీయ పార్టీలు వ్యూహాలు, ప్రతి వ్యూహాలతో ముందుకు వెళుతున్నాయి. ఇప్పటిదాకా తమిళనాడులో డీఎంకే, ఏడిఎంకె పార్టీలే మార్చి.. మార్చి అధికారాన్ని సొంతం చేసుకుంటూ వస్తున్నాయి. ఇటీవల నటుడు విజయ్ సొంత పార్టీని ఏర్పాటు చేసి ఈసారి ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నారు. గత మూడు నెలలుగా శని ఆదివారాలు ప్రజల్లోకి వెళ్లేందుకు వీకెండ్ టూర్ ఏర్పాటు చేసుకున్న విజయ్ ఆ దిశగా వరుస సభలు నిర్వహించారు. అయితే కరూర్ లో తొక్కిసలాటలు 41 మంది మృతి చెందడంతో సభలకు ఇచ్చే అనుమతి విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. దీంతో టీవీకె పార్టీ స్పీడ్ కాస్త తగ్గింది..అయితే ప్రధాన పార్టీల నుంచి సీనియర్ లీడర్లను తమ వైపు తిప్పుకోవడంలో విజయ్ బాగా సక్సెస్ అయ్యారు. తొమ్మిది సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అన్నాడీఎంకెలో సీనియర్ గా ఉన్న మాజీమంత్రి సెంగోట్టియన్, మరో సీనియర్ నేత నాంజల్ సంపత్ సహా పలువురు విజయ్ పార్టీలో చేరారు. ఎఐడీఎంకే నుంచి మరికొందరు సీనియర్ నేతలను పార్టీలోకి చేర్చుకునేందుకు ఇప్పటికే రంగం సిద్ధమైంది. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో ప్రజల్లోకి వెళ్ళేందుకు మరింత వ్యూహాత్మకంగా విజయ్ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. చెన్నైలోని పార్టీ కార్యాలయంలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రచార కార్యక్రమాలు,



కూటమి ఏర్పాటులో ఏఏ పార్టీ ఉండాలి అన్న అంశంపై నిర్ణయాలు.. ఎన్నికల మేనిఫెస్టో లో ఏ ఏ అంశాలు ఉండాలి. ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. అందుకోసం ఏర్పాటు చేసిన కమిటీలు వాటికి సంబంధించిన నివేదికలు సిద్ధం చేయనున్నాయి. విజయ్ సీఎం అభ్యర్థిగా అంగీకరించే పార్టీలతోనే పొత్తు ఉంటుందని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఎన్నికల్లో తమ మేనిఫెస్టో లో ఉండాల్సిన అంశాల పై కమిటీ నివేదిక రూపొందించాలని విజయ్ సూచించినట్లు సమాచారం. ప్రచారకార్యక్రమాలు సభల విషయంలో అందుకోసం ఏర్పాటు చేసిన కమిటీ ప్రణాళికలను సిద్ధం చేయాల్సి ఉంటుంది. విజయ్ తమిళనాడులో డీఎంకే పార్టీకి కూడా సాధ్యం కానీ కొంగు మండలంలో పట్టు ఏడీఎంకే పార్టీకి ఉంది.. అలాంటి చోట పట్టు సాధించడం కోసం అక్కడ బలమైన నాయకుడు మాజీ సీఎం పలనీ స్వామి సామాజిక వర్గానికి చెందిన సెంగోటియన్ ను పార్టీలోకి చేర్చుకున్నారు విజయ్. సంస్థాగతంగా పార్టీ బలపడాలంటే పార్టీలో అనుభవం ఉన్న ఇలాంటి సీనియర్లు ఉండాలని భావించిన విజయ్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇదేవిధంగా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఒక్కో సీనియర్ నేతను తన పార్టీలోకి చేర్చుకుని సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసే దిశగా ముందుకు వెళుతున్నారు. మరోవైపు ఏడిఎంకె బీజేపీ కోటమిలోకి విజయ్ ను తీసుకురావాలని ఆ రెండు పార్టీలు తీవ్రంగా ప్రయత్నించినా అది కుదరలేదు.

# అప్పుడు వద్దు... ఇప్పుడు ముద్దా..?


**కడప,తెలంగాణ దిశ :** షిరిడి సాయి ఎలక్ట్రికల్స్ అనే కంపెనీ పేరు వింటేతెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు జగన్ గుర్తుకు వస్తారు. వైఎస్‌ఆర్‌సీపీ హయాంలో ఈ కంపెనీకి ఏపీలో అగ్ర తాంబూలం దక్కింది. పవర్ రంగానికి చెందిన కాంట్రాక్టులు, ట్రాన్స్ ఫార్మర్ల సరఫరా చేసే కాంట్రాక్టులు అన్నీ ఈ కంపెనీకే దక్కేవి. టీడీపీ నేతలు కూడా తీవ్రంగా ఆరోపణలు చేసేవారు. టీడీపీ రాగానేఆ కంపెనీ అక్రమాలన్నీ బయటకు తీస్తారని అనుకున్నారు. కానీ ఆ కంపెనీకి టీడీపీ ప్రభుత్వంలోనూ ప్రాధాన్యత లభిస్తోంది. తాజాగా వంద కోట్లకుపైగా స్టాంప్ డ్యూటీని మినహాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం షిరిడీసాయి ఎలక్ట్రికల్స్ అనుబంధ సంస్థ అయిన సూర్యచక్ర డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కు భారీ స్టాంప్ డ్యూటీ మినహాయింపు ఇచ్చింది.


ఈ మినహాయింపు మొత్తం రూ. 104.51 కోట్లు. ఈ మేరకు జీవోలు జారీ అయింది. షిరిడీసాయి ఎలక్ట్రికల్స్ ఇప్పటికే శ్రీసిటీ లో రూ. 3,000 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టి సోలార్ ప్యానల్స్ ఫ్యాక్టరీ పెట్టాలనుకుంటోంది. ఇప్పుడు కంపెనీ తన అనుబంధ సంస్థ సూర్యచక్ర డెవలపర్స్ ద్వారా కొత్తగా మరో రూ. 2,000 కోట్ల పెట్టుబడి పెడతామని మినహాయింపులు కోరింది. ప్రభుత్వం డిసెంబర్ 2025లో జారీ చేసిన ఊా ఓబ. ఔనీ. 9 ప్రకారం.. 5,000 ఎకరాలకు పైగా కాకుండా కొనుగోలు చేసే భూమికి 100 శాతం స్టాంప్ డ్యూటీ మినహాయింపు ఇస్తున్నారు. సూర్యచక్ర డెవలపర్స్ కొనుగోలు చేసిన భూమి విలువ రూ. 1,045 కోట్లు కాగా, దానిపై వచ్చే స్టాంప్ డ్యూటీ పూర్తిగా మాఫీ చేశారు. దీని వల్ల ఆ కంపెనీకి రూ. 105 కోట్ల లాభం ఉంటుంది. షిరిడీసాయికి ఇది మొదటిసారి కాదు.

గతంలోనూ 2021?23 మధ్య అంటే జగన్ హయాంలోనూ ఈ కంపెనీకి సుమారు రూ. 200 కోట్లకు పైగా స్టాంప్ డ్యూటీ, ల్యాండ్ కన్వర్షన్ ఛార్జీలు మాఫీ చేశారు. మొత్తం మీద ఈ కంపెనీకి ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. 300 కోట్లకు పైగా ప్రోత్సాహకాలు వచ్చాయి.టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత షిరిడి సాయి ఎలక్ట్రికల్స్ కు 8,365 ఎకరాల భూమి కేటాయించారు. పదేళ్ల కిందట షిరిడి సాయి ఎలక్ట్రికల్స్ ట్రాన్స్ ఫార్మర్లు తయారు చేసే కంపెనీ. తర్వాత భారీ విద్యుత్ కంపెనీగా మారింది. విద్యుత్ ప్రాజెక్టులు, పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులు కడతామని ఒప్పందాలు చేసుకుంది. ఈ కంపెనీ నర్రెడ్డి విశ్వేశ్వర్ రెడ్డి అనే వ్యక్తికి చెందినది.

రామయపట్నం వద్ద సోలార్ ప్లేట్లు తయారు చేస్తామంటూ ఓ కంపెనీ షిరిడి సాయి ఎలక్ట్రికల్స్ ఇండో సోల్ పేరుతో ప్రారంభించింది. పది లక్షల అథరైజ్డ్ క్యాపిటల్‌తో ప్రారంభమైన ఈ కంపెనీ పెద్ద ఎత్తున భూముల్ని తీసుకుంది. వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు షిరిడిసాయి ఎలక్ట్రికల్స్‌కు కడప నగరానికి ఆనుకుని ఉన్న ఐటీ సెజ్ భూములు.కానీ డీ నోటిఫై చేసి 49.8 ఎకరాలను కేటాయించారు. సోమశిల వద్ద కూడా షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ సోమశిల వద్ద 900 మెగావాట్ల ప్రాజెక్టులకు అనుమతి ఇచ్చింది. అల్లూరి సీతారామరాజుజిల్లా ఎర్రవరం వద్ద 1200 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టును షిరిడి సాయి సంస్థకు ప్రభుత్వం నామినేషన్ పద్దతిలో జగన్ ప్రభుత్వం కేటాయించింది. ఇది చట్ట విరుద్ధమని టీడీపీ ఆరోపించింది.ఈ కంపెనీ తీరుపై పవన్ కల్యాణ్ విచారణకు కూడా ఆదేశించారు. శేషాచలం వైల్డ్ లైఫ్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతోందని ఫిర్యాదులు ఉన్నాయి. తమ హయాంలో తమ బినామీ అని ప్రచారం చేసినా.. ఇప్పుడు ఆ సంస్థకు పెద్ద ఎత్తున భూములు, రాయితీలు కల్పించడాన్ని వైసీపీ కూడా ప్రశ్నించడం లేదు. ఆ సంస్థకు మద్దతుగానే వైసీపీఉంది. అంటే.. రెండు పార్టీలకూ షిరిడిసాయి దగ్గర సంస్థ అని అర్థమవుతోంది. కానీ ఆరోపణలు చేసిన టీడీపీ ప్రజలకు సమాధానం చెప్పాల్సి ఉంటుందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

# తీపి రుగ్మతను.. తిప్పి కొడదాం





డయాబెటిస్.. దాదాపు ప్రతి ఇంట్లో వినిపించే జీవనశైలి ప్రధానమైన జబ్బు. ఇది ఒక్కసారి వస్తే జీవితాంతం వదలదు. బతికినంత కాలం మందులు వాడాల్సిందే. అయితే, ఇది నిన్నటి మాట. వచ్చిన రోగాన్ని తిరిగి వెనక్కి పంపించవచ్చనేది నేటి భరోసా! అవును ఇది అక్షరాల నిజమే. డయాబెటిస్‌ను నియంత్రించడమే కాకుండా వ్యాధిని వెనక్కి తిప్పి కొట్టవచ్చుంటున్నారు వైద్యరంగ నిపుణులు. దీనికి కొన్ని నియమ నిబంధనలు, వయసు పరిమితి, వ్యాధి వచ్చిన కాలపరిమితి లాంటివి కీలకం అని చెబుతున్నారు. ఒక్కసారి షుగర్ వ్యాధి వచ్చిన తర్వాత రివర్సల్ డయాబెటిస్ ఎలా సాధ్యం, అందుకు పాటించాల్సిన ఆరోగ్య నియమాలు, తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలను నేటి ఊపిరిలో తెలుసుకుందాం.

డయాబెటిస్ అంటే రక్తంలో చక్కెర (బ్లడ్ గ్లూకోజ్) స్థాయులు పెరగడం. 80వ దశకానికి ముందు డయాబెటిస్ అనే సమస్య ఒకటి ఉందనే విషయం చాలామందికి తెలియదు. కాలక్రమేణా ఈ సమస్య 60 ఏండ్లు పైబడిన వారికి, బాగా డబ్బున్నవాళ్లలో మాత్రమే ఎక్కువగా కనిపించేది. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, ఉరుకులు పరుగుల ఉద్యోగాలు తదితర కారణాలతో ప్రస్తుతం ఈ వ్యాధి వయసు, ఆర్థిక స్థాయి, లింగ భేదంతో సంబంధం లేకుండా అందరిలోనూ వస్తున్నది. పిల్లల్లో జువైనల్ డయాబెటిస్‌గా లేదా టైప్-1 డయాబెటిస్‌గాను, పెద్దల్లో ఎక్కువ శాతం టైప్-2 డయాబెటిస్ రూపంలో దాడి చేస్తుంది. శాస్త్రీయంగా చూస్తే డయాబెటిస్ రావడానికి ప్రధాన కారణం క్లోమగ్రంథిలోని బీటా కణాలు అవసరమైనంత మోతాదులో ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేయలేక పోవడం. లేదా ఉత్పత్తి అయిన ఇన్సులిన్ సరిగా పనిచేయకపోవడం. వ్యాధి నిరోధక వ్యవస్థకు సంబంధించిన కారణం వల్ల చిన్నారుల్లో కూడా ఈ సమస్య వచ్చే అవకాశం ఉంటుంది. బీటా కణాలు పనిచేయకపోవడం పిల్లల్లో అసలు ఇన్సులిన్ తయారు కాదు. అందు వల్ల వీళ్లకు తప్పనిసరిగా ఇన్సులిన్ ఇంజెక్షన్లు అవసరం అవుతాయి. పెద్దవారిలో సర్వసాధారణంగా కనిపించేది రెండో రకం డయాబెటిస్. 90 శాతం మంది మధుమేహులు టైప్-2 ఉన్నవారే. జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవడం వల్ల దీన్ని నియంత్రించవచ్చు. స్థూలకాయం ఉన్న కొందరు మహిళల్లో గర్భిణిగా ఉన్నప్పుడు కనిపించేది జెస్టేషనల్ డయాబెటిస్. ఇది తాత్కాలికమే అయినప్పటికీ దీర్ఘకాలంలో టైప్ 2 డయాబెటిస్ వచ్చే అవకాశం ఎక్కువ.

ఎలా వెనక్కి పంపవచ్చు?: టైప్-2 డయాబెటిస్ ఉన్న రోగుల్లో మాత్రమే రివర్సల్ డయాబెటిస్ సాధ్యపడుతుంది. అంటే వ్యాధిని వెనక్కి పంపవచ్చు. టైప్-1 వారిలో రివర్సల్ డయాబెటిస్ సాధ్యపడదు.

ఎప్పుడు సాధ్యం?: షుగర్ వ్యాధి వచ్చిన రెండు సంవత్సరాల్లోపు, లేదా ప్రీ డయాబెటిస్ దశలో రివర్సల్ డయాబెటిస్ సాధ్యమవుతుంది. అంటే వచ్చిన రోగాన్ని వెనక్కి పంపవచ్చు. ఈ రివర్సల్ డయాబెటిస్ అనేది గతంలో కూడా ఉన్నది. కాకపోతే అప్పుడు అందుబాటులో ఉన్న మందులతో అది పెద్దగా సాధ్యపడలేదు. ప్రాచుర్యంలోకి కూడా రాలేదు. గత నాలుగైదు సంవత్సరాలుగా ఈ రివర్సల్ డయాబెటిస్‌పై దృష్టి పెట్టారు. వైద్యరంగంలో వస్తున్న మార్పుల్లో భాగంగా ప్రస్తుతం ఊబకాయం కోసం కొత్త కొత్త మందులు అందుబాటులోకి వస్తున్నాయి. వీటి సాయంతో రివర్సల్ డయాబెటిస్ మంచి ఫలితాలు ఇస్తున్నది. జీవనశైలిలో మార్పులతోపాటు కొన్ని రకాల మందులతో రివర్సల్ డయాబెటిస్ సాధ్యపడుతుంది.

సాధారణ చక్కెర స్థాయులు: పరగడుపున (అల్పహారానికి ముందు) ఫాస్టింగ్ బ్లడ్ షుగర్ స్థాయులు 100 ఎంజీ/డీఎల్ కంటే తక్కువగా ఉండాలి. భోజనం చేసిన రెండు గంటల్లోపు పోస్ట్ ప్రాండియల్ బ్లడ్ గ్లూకోజ్ స్థాయులు 140ఎంజీ/డీఎల్‌గా ఉండాలి.

చికిత్సా పద్ధతి: షుగర్ వ్యాధి వచ్చి, మందులు వాడుతున్న వారికి లేదా ప్రీ-డయాబెటిస్ రోగులకు రివర్సల్ డయాబెటిస్ చికిత్స అందించవచ్చు. అయితే ఇది అందరికీ సాధ్యపడదు. వ్యాధి వచ్చిన రెండేండ్ల లోపు వారిలో మాత్రమే మంచి ఫలితాలు కనిపిస్తాయి. ఇక చికిత్స విధానంలోకి వెళ్తే షుగర్ వ్యాధిగ్రస్తులు డయాబెటిస్ మందులు వాడుతూనే వైద్యుల సూచన మేరకు ఆహారపు అలవాట్లు, జీవనశైలి మార్పులు కూడా చేసుకోవాలి. అంతేకాకుండా వ్యాయామం తప్పనిసరిగా చేయాలి. దీనివల్ల నెమ్మదిగా షుగర్ అదుపులోకి వస్తుంది. మొదటి నెలలోనే ఫలితాలు కనిపించడం మొదలవుతుంది. వీరికి మొదటి మూడు నెలల వరకు ప్రతినెలా షుగర్ పరీక్షలు చేస్తూ పర్యవేక్షించాలి. ఆ తర్వాత ప్రతి 3 నెలలకు ఒకసారి షుగర్ టెస్టు చేయాల్సి ఉంటుంది. అయితే వ్యాధి నియంత్రణలోకి వచ్చిన తర్వాత క్రమంగా మందుల మోతాదును తగ్గిస్తూ పోతారు. ఫాస్టింగ్ (పరగడుపున) బ్లడ్ గ్లూకోజ్ స్థాయులు 100ఎంజీ/డీఎల్ కంటే తక్కువగా, పోస్ట్ ప్రాండియల్ (తిన్న రెండు గంటల తర్వాత) బ్లడ్ గ్లూకోజ్ స్థాయులు 140ఎంజీ/డీఎల్, హెచ్‌బీఏ-1సి శాతం 5.7కంటే తక్కువగా వచ్చిన తర్వాత డయాబెటిస్ మందులను పూర్తిగా నిలిపివేస్తారు.

మూడు నెలల తర్వాత..: డయాబెటిస్ మందులు మానేసిన 3 నెలల తర్వాత కూడా ఫాస్టింగ్ బ్లడ్ షుగర్ స్థాయులు 100ఎంజీ/డీఎల్ కంటే తక్కువగా, పోస్ట్ ప్రాండియల్ బ్లడ్ గ్లూకోజ్ 140ఎంజీ/డీఎల్‌గాను, హెచ్‌బీఏ 1సి 5.7 శాతం కంటే తక్కువగా ఉంటే అప్పుడు రోగిని రివర్సల్ డయాబెటిస్ కింద పరిగణిస్తారు. అంటే షుగర్ వ్యాధి తగ్గినట్టుగా భావించవచ్చు. ప్రస్తుతం 10 మంది డయాబెటిస్ రోగులకు రివర్సల్ చికిత్స అందిస్తే అందులో ఆరుగురిలో వ్యాధి నియంత్రణలోకి రాగా ఇద్దరిలో రివర్సల్ డయాబెటిస్ ఫలితాలు వస్తున్నాయి. డైట్, బరువు, ఆహారపు అలవాట్లు మార్చుకుని, క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే రివర్సల్ డయాబెటిస్ సాధ్యమే! అంటే తాత్కాలికంగా షుగర్ తగ్గవచ్చు. ఈ సమయంలో షుగర్‌ను క్రమం తప్పకుండా పరీక్షించుకోవాలి. అయితే, మందులు వాడాల్సిన అవసరం లేదు. పాంక్రియా (క్లోమగ్రంథి) సామర్థ్యం అధికంగా ఉండటం వల్ల షుగర్ స్థాయులు తగ్గే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

రీ-రివర్స్ డయాబెటిస్: ఒక్కసారి వచ్చి, తగ్గిపోయిన తర్వాత మళ్లీ వచ్చే డయాబెటిస్‌ను రీ-రివర్స్ డయాబెటిస్ అంటారు. జీవనశైలి, ఆహారపు అలవాట్లు సరిగ్గా పాటించకపోతే అప్పుడు మళ్లీ డయాబెటిస్ వచ్చే అవకాశం ఉంటుంది. అయితే రివర్సల్ డయాబెటిస్ ఫలించిన కొందరు రోగుల్లో ఆరు నెలలకే మళ్లీ రీ-రివర్స్ డయాబెటిస్ రావచ్చు. ఆరోగ్య నియమాలు తు.చ. తప్పకుండా పాటించే వారిలో కొన్ని సంవత్సరాల వరకు కూడా మళ్లీ డయాబెటిస్ రాకపోవచ్చు.

పాటించాల్సిన ఆహార నియమాలు: బాగా మరపట్టిన బియ్యంతో చేసిన అన్నం తినకూడదు. బ్రేక్‌ఫాస్ట్‌లో ఇడ్లీ, దోశ వంటి తెల్లటి పిండి పదార్థాలతో తయారుచేసిన వంటకాలకు దూరంగా ఉండాలి. ఆలు, బీట్‌రూట్, క్యారెట్లు కూడా తీసుకోకూడదు. బేకరీ పదార్థాలను అసలే తినకూడదు. కాఫీ, టీలో చక్కెరను పూర్తిగా తగ్గించాలి. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి. కుటుంబ నేపథ్యం ఉన్నవారు..

కుటుంబ నేపథ్యంలో డయాబెటిస్ బాధితులు ఉన్నవారు పై నియమాలు కచ్చితంగా పాటించాలి. ప్రతిరోజూ కనీసం 20 నిమిషాలు లేదా వారంలో 150 నిమిషాలు వాకింగ్ లేదా రన్నింగ్ వంటివి చేయాలి. తల్లిదండ్రులకు షుగర్ ఉంటే వారి పిల్లలు తమ బరువును అదుపులో ఉంచుకోవాలి.

బరువు తగ్గడానికి..: జీఎల్‌పి-1 ఎనలాక్ మందులు సిమాగ్లోగ్లుటైడ్, సీరాగ్లుటైడ్ తదితర మాలిక్యూల్స్ అందుబాటులో ఉన్నాయి. వీటివల్ల షుగర్ నియంత్రణలోకి వచ్చి ఆహారం తీసుకోవడం తగ్గుతుంది. దీంతో బరువు తగ్గడమే కాకుండా షుగర్ కూడా నియంత్రణలోకి వస్తుంది. చివరగా వ్యాధి రివర్సల్ అయ్యే అవకాశాలు ఉంటాయి.



## రాత్రి పూట ఎట్టి పరిస్థితిలోనూ ఈ ఆహారాలను అసలు తినకండి..

ప్రస్తుతం ఉరుకుల పరుగుల బిజీ యుగం కారణంగా చాలా మంది అస్తవ్యస్తమైన జీవనశైలిని పాటిస్తున్నారు. ముఖ్యంగా ఆహారం విషయంలో శ్రద్ధ ఉండడం లేదు. ఇష్టం వచ్చిన సమయానికి ఏది పడితే దాన్ని తింటున్నారు. సాయంత్రం అయిందంటే చాలు.. జంక్ ఫుడ్‌ను విపరీతంగా లాగించేస్తున్నారు. ఇక రాత్రి పూట అధికంగా క్యాలరీలు ఉండే ఆహారాన్ని ఆలస్యంగా తింటున్నారు. ఇలా ఆహారం విషయంలో ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తుండడం వల్ల అనేక వ్యాధులు వస్తున్నాయి. ఆహారం విషయంలో జాగ్రత్తలను పాటించకపోవడం వల్ల అధికంగా బరువు పెరుగుతున్నారు. డయాబెటిస్ వస్తోంది. గుండె జబ్బుల బారిన పడుతున్నారు. అయితే రాత్రి పూట కొన్ని రకాల ఆహారాలకు దూరంగా ఉండడం వల్ల ఆరోగ్యానికి కలిగే హాని నుంచి కొంత వరకు అయినా తప్పించుకున్న వారు అవుతారు. రాత్రి సమయంలో కొన్ని ఆహారాలను తినడం మానేస్తే ఆరోగ్యంగా ఉండవచ్చు.

**కారం, మసాలాలు, నూనె పదార్థాలు..:** రాత్రి పూట చాలా మంది కారం, మసాలాలు అధికంగా ఉండే ఆహారాలను తింటుంటారు. ముఖ్యంగా నాన్ వెజ్ కూరలు, బిర్యానీ, పులావ్ వంటి ఆహారాలను తింటుంటారు. అయితే రాత్రి పూట వీటిని తింటే జీర్ణాశయంలో ఆమ్లాలు అధికంగా ఉత్పత్తి అవుతాయి. దీంతో తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం కాక అజీర్తి ఏర్పడుతుంది. కడుపులో మంట, గ్యాస్ వంటి సమస్యలు వస్తాయి. ఇవి నిద్రకు భంగం కలిగిస్తాయి. దీంతో రాత్రి పూట సరిగ్గా నిద్ర ఉండదు. ఇది మళ్లీ ఇతర వ్యాధులకు కారణమవుతుంది. కనుక రాత్రి పూట కారం, మసాలా ఆహారాలను తినడం మానేయాలి. అలాగే పకోడీలు, సమోసాలు, నూనె అధికంగా వేసి తయారు చేసే వేపుళ్లు, నూనె పదార్థాలు, ఇతర జంక్ ఫుడ్‌ను కూడా రాత్రి పూట తినకూడదు. ఇవి జీర్ణక్రియను నెమ్మదింపజేస్తాయి. పొట్టలో గ్యాస్ ఏర్పడేలా చేస్తాయి. దీంతో కడుపు ఉబ్బరం వస్తుంది. రాత్రి పూట నిద్ర కూడా సరిగ్గా పట్టదు.

**కొవ్వులు, ప్రోటీన్లు..:** రాత్రి పూట చాలా మంది రెస్టారెంట్లను తెప్పించుకున్న ఫుడ్‌ను తింటారు. లేదా బయటకు వెళ్లి భోజనం చేస్తుంటారు. ఈ క్రమంలోనే చాలా మంది చికెన్, మటన్, చేపలు, రొయ్యలు వంటి నాన్ వెజ్ ఆహారాలను బయట అధికంగా తింటుం టారు. వీటిని రాత్రి పూట తినడం అంత మంచిది కాదు. ఉదాహరణకు కబాబ్స్, బటర్ చికెన్ వంటి వాటిల్లో కొవ్వులు, ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. ఇవి రాత్రి పూట జీర్ణం అయ్యేందుకు సమ యం పడుతుంది. కనుక రాత్రి వీటిని తీసుకోవడం మానేయాలి. అలాగే చక్కెర అధికంగా ఉండే ఆహారాలను లేదా స్వీట్లను రాత్రి పూట తినకూడదు. ఇవి షుగర్ లెవల్స్‌ను విపరీతంగా పెంచుతా యి. దీంతో నిద్రకు ఆటంకం కలుగుతుంది. అలాగే దీర్ఘకాలంగా ఇలా చేస్తే టైప్ 2 డయాబెటిస్ వచ్చే అవకాశాలు పెరుగుతాయి. **టీ లేదా కాఫీ, ప్రాసెస్డ్ ఫుడ్స్..:** కొందరు రాత్రి పూట భోజనం చేసిన అనంతరం టీ లేదా కాఫీ సేవిస్తుంటారు. ఇలా చేస్తే కెఫీన్ శరీరంలో అధిక మొత్తంలో చేరుతుంది. ఇది నిద్రకు ఆటంకం కలిగిస్తుంది. కనుక రాత్రి పూట టీ, కాఫీలను తాగకూడదు. అయితే అంతగా తాగాలనిపిస్తే హెర్బల్ టీలను సేవించవచ్చు. కమోమిల్ టీని రాత్రి పూట సేవిస్తే మైండ్ రిలాక్స్ అయి నిద్ర చక్కగా పడుతుంది. అదేవిధంగా రాత్రి పూట ప్రాసెస్ చేయబడిన ఆహారాలను కూడా తినకూడూదు. నూడుల్స్, రెడీ టు ఈట్ ఫుడ్స్‌ను రాత్రి తినకూడదు. వీటిల్లో అధికంగా ఉండే సోడియం డీహైడ్రేషన్‌ను కలగజేస్తుంది. దీంతో కిడ్నీలపై భారం పడుతుంది. దీర్ఘకాలంలో కిడ్నీలు చెడిపోయే ప్రమాదం ఉంటుంది. కాబట్టి రాత్రిపూట ఈ ఫుడ్స్‌ను కూడా మానేయాల్సి ఉంటుంది. ఇలా రాత్రి పూట తీసుకునే ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యంగా ఉండవచ్చు. బరువు పెరగకుండా ఉంటారు. గుండె జబ్బులు రాకుండా ఉంటాయి.

## ఎండల్లో పెరటి మొక్కల సంరక్షణ..

ఎండల్లో పెరటి మొక్కల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వేసవికాలమని కుండీల్లోని మొక్కలకు కొంతమంది అదేపనిగా నీరు పోస్తుంటారు. ఇలా చేస్తే మొక్కల వేర్లు మురిగిపోయే ప్రమాదం ఉంటుంది. కాబట్టి..సూర్యోదయానికి ముందు, సూర్యాస్తమయం తర్వాతే మొక్కలకు నీళ్లు పోయాలి. ఈ సమయ మైతేనే.. నీళ్లు నేలలోకి ఇంకిపోవడానికి, వేర్లను చేరుకోవడానికి అనుకూలంగా ఉంటుంది.మొక్కల సంరక్షణలో మొదట చేయాల్సిన పని 'కలుపు'ను ఏరివేయడం.వసంత మాసంలో మొక్కల పెరుగుదల ఎక్కువ. ఈ కాలంలో చీడపీడల బాధ తక్కువ. కాబట్టి, మొక్కలు వేగంగా, ఆరోగ్యంగా పెరుగుతుంటాయి. అయితే మొక్క మరింత ఆరోగ్యకరంగా ఉండా లంటే.. కత్తిరింపులు చేయాలి. క్రాసింగ్, దెబ్బతిన్న కొమ్మలు ఉంటే, వాటిని తొలగించాలి. మొక్కలు బాగా ఎదగాలని ఏ ఎరువులు పడితే అవి పరిమితికి మించి వాడకూడదు. మొక్కలకు సరిపోయేదే ఎన్నుకోవాలి. నత్రజని ఆధారిత ఎరువులు వేసవికి అనుకూలంగా ఉండటంతోపాటు మొక్కల పెరుగుదలనూ ప్రోత్సహిస్తాయి.





## రాగి పాత్రల్లో నీళ్లు తాగితే ఎంతో ఆరోగ్యం

రాగి పాత్ర... అంటే ఏంటి అని అడిగే వాళ్ళు కూడా ఉంటారు ఈ రోజుల్లో. ఎందుకంటే... ఇపుడంతా ప్లాస్టిక్, గాజు గ్లాసులే ఎక్కువగా వాడుకలో ఉన్నాయి. వీలైతే పేపర్ గ్లాసులు కూడా వాడేస్తున్నారు. కానీ, రాగి పాత్రలో మంచినీళ్ళు తాగితే ఎంత మంచిదో తెలుసా? ఇది బ్యాక్టీరియాను అరికడుతుందని పరిశోధనలో తేలింది. రాబ్ రీడ్ అనే మైక్రో బయాలజిస్ట్ ప్లాస్టిక్, మట్టి, రాగి పాత్రలలో విరోచనాకారి అయిన బాక్టీరియాతో కూడిన నీటిని వాటిలో ఉంచి, 48 గంటల తరువాత ఆ నీటిపై పరిశీలన చేశాడు. రాగి పాత్రలో ఉంచిన నీళ్ళలో బాక్టీరియా శాతం తగ్గింది. అదే ప్లాస్టిక్, మట్టి పాత్రలో ఉన్న బాక్టీరియా శాతం రెండింతలు అయ్యింది.

రాగి పాత్ర వల్ల ఉపయోగాలు:జీర్ణ వ్యవస్థకు మంచిది: రాగి పాత్రలో నీరు తాగడం వల్ల అసిడిటీ, గ్యాస్, అజీర్ణం వంటివి తగ్గడమే కాకుండా, కడుపుకి హాయి కలిగించి, ప్రాణాంతకరమైన బాక్టీరియాను కూడా నిర్మూలిస్తుంది. కిడ్నీ, లివర్ చురుకుగా పనిచేయడంలో తోడ్పడుతుంది.

బరువు తగ్గిస్తుంది: మనం అధిక బరువు తగ్గడానికి రకరకాల పండ్లు, కూరగాయలు వంటివి తింటూ ఉంటాం. కాని వాటివల్ల వచ్చే ప్రయోజనాల కన్నా, వాటికి ఖర్చుపెట్టిన డబ్బు వ్యర్థం అయిందన్న దిగులే ఎక్కువ. రాగి పాత్రలో నీరు తాగడం వల్ల అది జీర్ణ వ్యవస్థను సరైన మార్గంలో నడిచేలా చేసి, కొవ్వు మరియు ఇతర చెడు బాక్టీరియాను శరీరం నుండి తీసేస్తుంది.

గాయాలను త్వరగా నయం చేస్తుంది: రాగిలో ఉండే యాంటీ-బాక్టీరియాతత్వం శరీరంలోని అనేక గాయాలను వేగంగా నయం చేయడంతోపాటు రోగనిరోధక వ్యవస్థను మెరుగుపరిచి, శరీరంపై ఉన్న గాయాలనే కాకుండా లోపల ఉన్న గాయాలను, ముఖ్యంగా కడుపులో ఉన్నగాయాలను కూడా తగ్గించడంలో సహాయం చేస్తుంది.

వయసును దాచేస్తుంది: కొంతమంది ఆరోగ్యపరంగా ఎంత చురుకుగా ఉన్నా వారి వయసుకు మించి కనిపిస్తూ ఉంటారు. ఈ సమస్య నుంచి బాధపడేవారు చాలామంది ఉన్నారు. ఇలాంటి వారు రాగి నుండి ఉత్పత్తి అయ్యే ప్రయోజనాలతో వారి సమస్య నుండి విముక్తి లభిస్తుంది. ముఖంపై ఉన్న మచ్చలు, ముడతలు వంటివి రాగి తగ్గిస్తుంది.

క్యాన్సర్ వ్యాధి నుండి పోరాడుతుంది: రాగిలో ఉండే యాంటీ-ఆక్సిడెంట్స్ క్యాన్సర్ వంటి ప్రాణాంతకరమైన రోగాల నుండి కాపాడుతాయి. అమెరికన్ క్యాన్సర్ సొసైటీ వారు చేసిన పరిశోధనాల ప్రకారం రాగి క్యాన్సర్‌ను ఎలా రానివ్వకుండా చేస్తుందో కనుగొనలేకపోయారు. కాని రాగి నిరంతరం క్యాన్సర్ వ్యాపింపజేసే వైరస్‌ను అడ్డుకోవడంలో తోడ్పడుతుందని ఆ పరిశోధనల్లో తేలింది.

మెదడును మెరుగుపరుస్తుంది: మన శరీర భాగంలో అతి ముఖ్యమైన అవయవాల్లో ఒకటి మెదడు. మనిషి శరీరంలో ప్రతీ ఒక్క భాగానికి మెదడుతో సంబంధాలు కలిగి ఉంటాయి. మెదడు నుండి ఆయా భాగాలకు న్యూరాన్ల ద్వారా సంకేతాలు అందుతాయి. ఈ న్యూరాన్లను మైలిన్ తొడుగు కాపాడుతుంది. రాగిలో ఉండే విలువైన పదార్థాలు ఈ మైలిన్ తొడుగును కపాడంతోపాటు, మెదడును చురుకుగా, యవ్వనంగా తయారుచేస్తుంది. ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ వారి ప్రకారం రాగిని రోజుకు 12మి.గ్రా కన్నా ఎక్కువ తీసుకునే అవసరం లేదు అంటే రాగి పాత్రలో కనీసం 8 గంటలు ఉంచిన మంచి నీటిని రోజుకి 3 నుంచి 4 సార్లు తీసుకుంటే సరిపోతుంది. అలాగే రాగి పాత్రని సబ్బుతో కాకుండా సగం కోసిన నిమ్మ చెక్కతో లేదా వంట సోడాతో రుద్ది నీటితో కడిగితే సరిపోతుంది.

## పెరుగులో మేలు చేసే గుణాలు



ఎండాకాలం తరుచుగా ఛాతిలో, కడుపులో మంటపుడుతూ ఉంటుంది. అలాంటప్పుడు చాలామంది కూల్‌డ్రింక్స్ లేదా కూలింగ్ వాటర్ తాగుతారు. వీటికన్నా పెరుగుతో చేసిన లస్సీగానీ, పెరుగు గానీ తింటే సమస్య తగ్గుతుంది. పెరుగులో శరీరానికి మేలు చేసే గుణాలు చాలా ఉన్నాయని ఆహార నిపుణులు చెబుతున్నారు.

ఆహారం తీసుకున్నా కడుపులో మంటగా ఉన్నప్పుడు రోజూ పరగడుపున ఒక కప్పు పెరుగు తింటే చాలా మంచిది. ప్రతిరోజూ పెరుగు తీసుకునే మహిళల్లో వెజైనల్ ఈస్ట్ ఇన్ఫెక్షన్లు వచ్చే చాన్స్ చాలా తక్కువని పరిశోధనలు చెబుతున్నాయి. పెరుగు శరీరంలో తేమ శాతం తగ్గిపోకుండా కాపాడుతుంది. అందుకే జీర్ణవ్యవస్థ పనితీరు బాగుంటుంది. పొట్టలో ఇన్ఫెక్షన్లు రాకుండా ఉంటాయి. హైబీపీ కూడా అదుపులోకి వస్తుంది. పని వల్ల బాగా ఒత్తిడికి గురైనవారు పెరుగు తీసుకుంటే అలసట తీరుతుంది. మంచి నిద్రలోకి వెళ్లి మెదడుపై ఒత్తిడి తగ్గుతుంది. కాబట్టి రోజువారీ ఆహారంలో తప్పనిసరిగా పెరుగు భాగం చేసుకోవాలి. పెరుగులో క్యాల్షియం అధికంగా ఉంటుంది. ఇది ఎముకలకు, దంతాలకు మేలు చేస్తుంది. పెరుగులో ఫాస్ఫరస్ కూడాఉంటుంది. ఇది క్యాల్షియంతో కలవడం వల్ల ఎముకలు స్ట్రాంగ్ గా ఉంటాయి. రోజూ పెరుగు తినడం వల్ల భవిష్యత్తులో కీళ్లనొప్పులు, ఆస్టియోపొరోసిస్ లాంటి సమస్యలు రాకుండా ఉంటాయి.

# కార్మికులు పురుగుల్లా చావాలా..?




**హైదరాబాద్,మార్చి,18,తెలంగాణ దిశ :** దక్షిణ కోల్‌కతా సరిహద్దులోని నజీరాబాద్ ఆనందపూర్ గోదాముల సముదాయంలో కార్మికులు సజీవ దహనమైపోతున్న విషాదకాండ దేశాన్ని కలచివేసింది. మృత దేహాలను వెలికితీసే పని పూర్తి కావడంతో ఈ మృతుల సంఖ్య 21కి చేరింది. మీడియాలో వచ్చే తాజా సమాచారాల ప్రకారమైతే మృతుల సంఖ్య కనీసం 31కి పెరిగింది. నిజానికి మొదట చెప్పింది కావాలని తగ్గించిన సంఖ్య. ఎందుకంటే జనవరి 29కే ఇంకా 28 మంది ఆచూకీ తెలియవలసి వుండింది. ఏదో తాత్కాలిక గుడారంలా ఉపయోగిస్తున్న ఆ గోదామును చుట్టుముట్టిన మంటలు చాలా భయానకమైనవి. బెంగాల్ రాష్ట్రం ఇరుగు పొరుగు జిల్లాల నుంచి తీసుకువచ్చిన వలస కార్మికులను ఆ గోదాములోబయటి నుంచి తాళాలు వేసి వుంచారన్న వార్త ఈ ఘటనలోని నేరస్త కోణాన్ని బయటికి తెచ్చింది. ఆ రాత్రి వారు గాఢ నిద్రలో వుండటంతో ఊపిరాడక ఉక్కిరి బిక్కిరై మరణించారు. ఏ విధంగానూ బయటికి వచ్చే మార్గం లేకపోయింది. వారు దేశంలో బాగా ప్రాచుర్యంలోకి వచ్చిన 'వావ్ మోమో' స్నాక్స్‌ను తయారు చేసే కార్మికులు. ఆధునిక కాలంలో కొనసాగుతున్న భయానక బానిసత్వం ఏమిటో ఈ ఘటన కళ్లకు కట్టింది. అలాంటి బ్రాండ్ల వెనక ఎంత ఘోరమైన దోపిడీ దాగివుందీ తెలుస్తుంది. ఇవి కేవలం ప్రమాదవశాన సంభవించిన మరణాలు కావని గ్రహించడం అవసరం. అంతు లేని లాభాల కోసం పాకులాడే అమానవీయ పద్ధతుల కారణంగా పాతుకు పోయిన ఒక హంతక వ్యవస్థకు ఈ ప్రాణాలు బలైనాయి. ఎన్ని గంటలు పని చేయించాలి?అదనపు గంటలకుఓవర్‌టైమ్ ఎంతచెల్లించాలి? కార్మికు లు సంఘంగా ఏర్పడే హక్కులు ఇలాంటివేమీ అనుమతించ కుండా కార్మికులకు సామాజిక భద్రతను నిరాకరించే వ్యవస్థ అది. ఇఎస్ఐ, ప్రావిడెంట్ ఫండ్ వంటి ప్రాథమిక కార్మిక హక్కులను కూడా వారికి లేకుండా చేస్తున్నారు. వారి కుటుంబాలకు చెప్పుకోదగిన ఎలాంటి భద్రతా ఏర్పాట్లులేవు. మిఠాయిదుకాణాల వంటిచోట్ల బతికే అసంఘ టిత కార్మికుల విషయంలోనూ ఇదే నిజం వర్తిస్తుంది. అగ్నిమాపక యంత్రాలు గానీ, అత్యవసర ద్వారాలు గానీ లేకుండా కనీసమైన గాలి, వెలుతురు సోకకుండా వారు పనిలో మగ్గిపోతుండాలి.

ఆద్యంతం నిర్లక్ష్యమే: ఈ విషాదం తీవ్రత ఇంతటితోనే ముగిసిపోలేదు. ఘోరానికి కారకులైన నేరస్తులను బోనెక్కించేందుకు అధికారులు చిటికెన వేలు కూడా కదల్చలేదు. చెప్పుకోదగినన్ని రోజులు గడిచినా సరే యజమానులను అరెస్టు చేయలేదు. ప్రమాద స్థలాన్ని సందర్శించే అవకాశం లేకుండా మూసివేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కూడా విషాదం వాస్తవాలు బయటికి రాకుండా తొక్కిపట్టేందుకు తన వంతు దోహదం చేసింది. కార్పొరేట్లు పర్యావరణ నిబంధనలను ఇష్టారీతిన ఉల్లంఘించడంలో×టిఎంసి రాష్ట్ర ప్రభుత్వం×వారితో కుమ్మక్కు అవుతుందనేది నిస్సందేహం. భూగర్భంలో చెత్త నిల్వ స్థలాలు, అంతర్జాతీయ ప్రాధాన్యత గల మాగాణి భూముల ఆక్రమణలు కూడా ఈ విషాదానికి ఎంతగానో కారణమైనాయి. మరోవైపున రాష్ట్ర కార్మికశాఖ కూడా తప్పనిసరిగా జరపాల్సిన తనిఖీలను, అగ్నిమాపక ఏర్పాట్లనూ పర్యవేక్షించకుండా నేరపూరిత నిర్లక్ష్యం వహించింది. ఈ వ్యవస్థాగత హత్యలకు రాష్ట్ర కార్మికశాఖ కూడా బాధ్యత వహించాల్సి వుంటుంది.

సిజెఐ వ్యాఖ్యల్లో వాస్తవమెం?: ఏమైనా అలాంటి దారుణమైన పని పరిస్థితులు పశ్చిమ బెంగాల్‌కే పరిమితమని అనుకోవడం పూర్తిగా తప్పే. అలాంటి పని పరిస్థితులు, వృత్తిపరమైన ఆరోగ్యం ఘోరంగా వుండటం దాదాపు అన్ని రా(ష్టాల్లోనూ ఒకేలా వుంటుంది. ఏదైనా చెల్లిపోతుందనే వాతావరణంతో పాటు కార్మికుల భద్రత పట్ల ప్రతికూల భావన కూడా అల్లుకుపోయింది. ఇది అతి పెద్ద వర్గ సమస్య. కార్మికుల పట్ల ఈ ప్రతికూల భావన మరింత పెంచడం కోసం అన్నట్టు మాట్లాడారు భారత ప్రధాన న్యాయమూర్తి. అది కూడా సుప్రీం కోర్టులోనే. పెన్ తొర్ఖిలాలర్ సంఘం వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం విచారణ సందర్భంలో ఒక్కసారిగా విరుచుకు పడ్డారు. "నిజంగా దేశంలో ట్రేడ్ యూనియన్ల కారణంగా ఎన్ని పారిశ్రామిక సంస్థలు మూతపడ్డాయి? ఒక్కసారి వాస్తవాలు చూద్దాం. సంప్రదాయికంగా వస్తున్న పరిశ్రమలు ఈ జండా యూనియన్ల కారణంగా దేశవ్యాపితంగా ఎన్ని మూతపడ్డాయి? వాళ్లకు పని వుండకూడదు. ఈ ట్రేడ్ యూనియన్ నాయకులు×వారే× దేశంలో పారిశ్రామికాభివృద్ధి ఆగిపోవడానికి చాలా వరకూ కారణం." చాలా పరుషమైన మాటలు. స్పష్టమైన మాటలు. దేశం మొత్తం మీద నెలకొన్న కార్మిక వ్యతిరేక వాతావరణాన్ని కళ్లకు కట్టే మాటలు. ఆ పేద వలస కార్మికులు 'వావ్ మోమో' వంటి కార్ఖానాల్లో బిచ్చాన్ని తలపించే వేతన కూలీతో, మృత్యు సన్నిధిని తలపించే పని పరిస్థితులలో గొడ్డుచాకిరిలో మగ్గిపోతున్నారంటే "పని చేయవద్దనుకోవడం" వల్లనేనా? జస్టిస్ సూర్యకాంత్ తన వర్గపరమైన వ్యతిరేకతతో మాట్లాడారని చెప్పవలసి రావడం విచారకరం. ఆయన మాటల్లో వ్యక్తమైన వ్యతిరేక భావన వాస్తవాలను చూడకుండా కళు కప్పేసింది. "భారత దేశంలో పారిశ్రామిక వివాదాలు, మూసివేతలు, తొలగింపులు, లే ఆఫ్‌ల"పై లేబర్ బ్యూరో నివేదికలు చూస్తే పారిశ్రామిక మాంద్యానికి వాస్తవమైన కారణమేమిటో అత్యంత సమగ్రంగా చెబుతాయి. దేశంలో పారిశ్రామిక వివాదాలు గణనీయంగా తగ్గిపోయాయనీ, 2023లో వరుసగా 17వ ఏడాది తక్కువగా నమోదైనాయని ఆ బ్యూరో నివేదిక చెబుతున్నది. 2023 సెప్టెంబరులో కేవలం ముప్పై వివాదాలు మాత్రమే నివేదించబడ్డాయి. ఇది 2006కు పూర్తి భిన్నమైన పరిస్థితి. అప్పుడు అత్యధికంగా 432 పారిశ్రామిక వివాదాలు నమోదైనాయి. తర్వాత 2008లో 421, 2007లో 389 నమోదైనాయి. మరోవైపున చట్టబద్ధంగానూ విరుద్ధంగానూ సాగుతున్న పరిశ్రమల మూసివేతలు యూనియన్లనేవి చాలా తక్కువగా వున్న, బలహీనంగా కనిపిస్తున్న రా(ష్టాల్లోనే చాలా ఎక్కువగా వున్నాయని విదితమవుతుంది. విలీనాలు, మార్పిళ్లు, రద్దుల వల్ల గత అయిదేళ్లలో 2,04,268 ప్రైవేటు కంపెనీలు మూతపడినట్టు కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ఇచ్చిన ఒక లిఖిత పూర్వక సమాధానంలో తెలియజేయడం ఆసక్తికరం. లేదంటే 2013 కంపెనీల చట్టం కింద ప్రతిష్టంభనలో చిక్కాయి. అంతేగాక భారతీయ పరిశ్రమల ప్రతిష్టంభన, దివాళా బోర్డు లెక్కలు చూసినా, ప్రభుత్వ రంగ బ్యాంకులు రాబట్టగలిగిన బకాయిల శాతం చూసినా ఈ మూసివేతలకు కారణాలు బాగా తెలుస్తాయి.

సంక్షోభం అసలు కారణాలు: అందువల్ల సిజెఐ మాటలు పూర్తిగా పొరబాటు దిశలో వున్నాయి. మూసివేతను రుద్దుతున్నది ట్రేడ్ యూనియన్ల వల్ల ఉత్పన్నమైన పారిశ్రామిక వివాదాలు కాదు. వాస్తవం అందుకు పూర్తి భిన్నం. ప్రస్తుత నయా ఉదారవాద వ్యవస్థ, ఆర్థిక వ్యవస్థలో మితిమీరిన కేంద్రీకరణ, ద్రవ్యీకరణ వల్ల ఉత్పన్నమైన అంతర్గత సంక్షోభమే ఇందుకు దారితీస్తున్నది. చిన్న మధ్యతరహా పరిశ్రమల (ఎం.ఎస్.ఎం.ఇ) రంగాన్ని, ఉత్పాదక రంగాన్ని అది మరింత దారుణంగా దెబ్బతీస్తున్నది. ఇవన్నీ కలిసే ప్రస్తుత మూసివేతలకు దారితీస్తున్నాయి.

పారిశ్రామిక రంగ సంక్షోభానికి కారణా లేమిటో ఇటీవలి ఆర్థిక సర్వే, అలాగే బడ్జెట్ సమీక్ష, మందస్తు అంచనాలు కూడా నొక్కి చెప్పాయి. ఆర్థిక వ్యవస్థలో స్థూల గిరాకీ లేకపోవడమే పరిశ్రమలు నడవలేని పరిస్థితిని సృష్టిస్తున్నది. తీవ్ర అసమానతలు, ఉద్యోగ రహిత అభివృద్ధి నమూనా వల్ల శ్రామికశక్తి నిస్పృహపాలు అవుతున్నది. ఈ విషాద పరిస్థితికి ప్రతిబింబమే ఆనందపూర్ ఘోరం. అధికార వర్గం ఈ వాస్తవాన్ని గుర్తించేబదులు సమిష్టి నిరసనలు, బేరసారాలు లేకుండా చేయాలని, సామాజిక భద్రత వల్ల లభించే రక్షణలను తొలగించాలని ప్రయత్నాలు పెంచుతున్నది. వాస్తవానికి దీనికి ప్రతిశక్తిగా న్యాయవ్యవస్థ ముందుకు రావడానికి ఇంతకంటే మంచి సందర్భం వుండదు. రాజ్యాంగం 19(1)(సి) ప్రకారం పౌరులకున్న సభ సంఘ స్వాతంత్ర్య హక్కుల మేరకు కార్మికులు నిరసన తెలిపే ప్రాథమిక హక్కును కాపాడేందుకు న్యాయవ్యవస్థ అధికారికంగా ముందుకు రావలసిన సందర్భం. లేబర్ కోడ్లు ఇప్పటికే అధికారికంగా ప్రకటించబడటంతో తాసు కార్మికులకు మరింత వ్యతిరేకంగా మారుతున్నది. కార్పొరేట్లకు సుఖవంతమైన పరిస్థితిని సృష్టించే పోకడ మరింత వేగం పుంజుకుంటున్నది. ఏ విధమైన సమిష్టి నిరసనలు, బేరసారాలకు అవకాశమే లేకుండా పూర్తిగా తొలగిస్తున్నది. కార్మికులకు గౌరవ ప్రదమైన మనుగడ లేకుండా చేసి పురుగుల్లా చావమని తోసేస్తామా అన్నదే ఇక్కడ ప్రశ్న.

## మూడు సంవత్సరాల క్రితం మిస్సైన వ్యక్తి తిరిగి స్వంత గూటికి..




**కరీంనగర్,తెలంగాణ దిశ :** మూడు సంవత్సరాల క్రితం మిస్సైన వ్యక్తి తిరిగి స్వంత గూటికి.. మూడు సంవత్సరాల క్రితం మిస్సింగ్ అయిన వ్యక్తిని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కరీంనగర్ రూరల్ పోలీస్‌లు స్వంత గూటికి చేర్చారు. వివరాలోకి వెళితే.. కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం .. గోదావరిఖని గౌత మీనగర్, బేడగా బుడిగజంగం కాలానికి చెందిన పస్తం సురేష్ (32)మూడు సంవత్సరాల క్రితం తన భార్య అనూషతో ఉన్న అపోహల కారణంగా కరీంనగర్ పట్టణ పరిధిలోని దుర్శేడ్‌లో ఉన్న తన అత్తవారి ఇంటి నుండి వెళ్లిపోయి కనిపించకుండాపోయాడని సీఐ తెలిపారు. బాధితుని బంధువుల ఫిర్యాదు మేరకు కరీంనగర్ రూరల్ పోలీసులు స్థానిక విచారణలు, సాంకేతిక విశ్లేషణ, అంతర్రాష్ట్ర సమన్వయంతో నిరంతరంగా కఠినంగా ప్రయత్నాలు చేయడంతో మిస్సింగ్ వ్యక్తి విశాఖపట్నం అలాగే నేపాల్ దేశంలోని కాఠ్మండు ప్రాంతాలలో నివసిస్తున్నట్లు గుర్తించారు. నిరంతర ఫాలోఅప్ ,ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సమర్థవంతమైన సమన్వయంతో మిస్సింగ్ వ్యక్తిని నేపాల్ దేశంలోని కాఠ్మండులో విజయవంతంగా ట్రేస్ చేసి సురక్షితంగా కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో హాజరుపరిచినట్లు సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. ఈ కేసులో ప్రణాళికాబద్ధమైన చర్యతో చాలా చురుగ్గా.. వ్యవహరించిన సీఐ నిరంజన్ రెడ్డిని వారి బృందాన్ని పై అధికారులు ప్రశంసించారు.

## అంబటి రాంబాబు మరో కుమార్తె సంచలన ఆరోపణలు

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**
మాజీ మంత్రి అంబటి రాంబాబు మరో కుమార్తె మోనిక సంచలన ఆరోపణలు చేశారు. కేంద్రమంత్రి పెమ్మసాని ఆదేశాల మేరకు గల్లా మాధవి పర్యవేక్షనలో పోలీసుల సహకారంతో అంబటి రాంబాబుపై హత్యాయత్నం జరిగిందని అన్నారు. పార్టీకి అతీతంగా దీనిని అందరూ ఖండిస్తుంటే గల్లా మాధవి మాత్రం దాడి అనంతరం ప్రెస్ మీట్ బెదిరించారని అన్నారు. మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచిన గల్లా మాధవికి ఇంత అహంకారం పనికిరాదని వ్యాఖ్యానించారు. పోలీసు వ్యవస్థ, న్యాయ వ్యవస్థల కంటే గల్లా మాధవి పవర్ ఫుల్ కాదన్నారు.పెమ్మసాని చదువుకున్న వ్యక్తి అని, విదేశాల నుండి వచ్చారని భావించారని కానీ ఆయన ఇక్కడ రాజకీయాలను భ్రష్టుపట్టిస్తున్నారని మండిపడ్డారు. రెబ్ బుక్ కు బయపడని అంబటి రాంబాబు.. లా అండ్ ఆర్డర్ పై గౌరవంతో క్షమాపణ చెప్పారన్నారు. 2వేల మంది చుట్టుముట్టి రాళ్లు రువ్వినా, కత్తులు దూస్తున్నా అంబటి రాంబాబు ఒక్కరే ధైర్యంగా ఉన్నారని చెప్పారు. ఎంతమంది చుట్టుముట్టినా ఇంటి గోడకు గుణపాలు దింపుతున్నా ధైర్యంగా ఇంట్లో కూర్చోడానికి కారణం వ్యవస్థపై ఆయనకు ఉన్న నమ్మకమే అని అన్నారు. కానీ ఆ వ్యవస్థలను ఈ రోజు నిర్వీర్యం చేసి ఇళ్లపైకి వచ్చి ఆడవాళ్ల మీద దాడులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పొల్యూషన్ రాజధానిగా హైదరాబాద్



**హైదరాబాద్,మార్చి,18,తెలంగాణ దిశ :** దేశరాజధాని ఢిల్లీ వాయు కాలుష్యానికి కేరాఫ్ అడ్రస్ గా మారింది. అక్కడున్న ప్రజలు.. వాయు కాలుష్యం బారిన పడి ఆరోగ్యాన్ని పోగొట్టుకుంటున్నారు. వీవీఐపీలు ఢిల్లీ వదిలి శివారు ప్రాంతాలకు మకాం మార్చేస్తున్నారు. అదే బాటలో ముంబై, చండీగఢ్ నడుస్తున్నాయి. అయితే వీటి బాటలోనే సౌత్ లో కీలక కేపిటల్ హైదరాబాద్ తయారైంది. హైదరాబాద్ లోని పలు ప్రాంతాల్లో కాలుష్యం ఎయిర్ పొల్యూషన్ ఇండెక్స్ నిర్దేశిత ప్రమాణాలను దాటేసింది.భాగ్యనగరం వాయు కాలుష్య కోరల్లో చిక్కుకుంటోంది. దేశ రాజధాని ఢిల్లీ, ముంబై వంటి నగరాలతో పోలిస్తే గాలి నాణ్యత మెరుగ్గా ఉన్నట్లు కనిపిస్తున్నప్పటికీ, దక్షిణాది రాష్ట్రాల మెట్రో నగరాలతో పోల్చితే హైదరాబాద్‌లోనే పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) వెల్లడించింది.హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఎయిర్ పొల్యూషన్ ఇండెక్స్' సదస్సులో పీసీబీ విడుదల చేసిన గణాంకాలు నగరవాసులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనల ప్రకారం గాలిలో సూక్ష్మ ధూళికణాలు (ఖఓ-10) 40 మైక్రోగ్రాములు ఉండాలి. కానీ, హైదరాబాద్‌లో ఇది 82 నుంచి 88 ఎంజీల వరకు ఉంటోంది. అంటే ఉండాల్సిన దానికంటే రెట్టింపు కాలుష్యాన్ని మనం పీలుస్తున్నాం. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) పరిమితి 60 ఎంజీతో పోల్చినా, హైదరాబాద్‌లో 35 శాతం అధిక కాలుష్యం ఉన్నట్లు స్పష్టమైంది.గత ఏడాది పొడవునా నగరంలో ఒక్క రోజు కూడా 'స్వచ్ఛమైన గాలి' ఉన్నట్లు రికార్డు కాలేదు. గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) కేవలం 'మధ్యస్థం' లేదా 'సంతృప్తికరం' స్థాయిలకే పరిమితమైంది. ఈ ఏడాది జనవరిలో పీఎం-10 స్థాయి గరిష్ఠంగా 105 ఎంజీ వరకు వెళ్లడం నగర గాలిలో పెరుగుతున్న విషతుల్యతకు నిదర్శనం.నగరంలో వాహనాల రద్దీ పెరగడంతో ఏడు ప్రధాన ప్రాంతాలను 'కాలుష్య హాట్‌స్పాట్లు'గా అధికారులు గుర్తించారు. అవి ఖైరతాబాద్-కోఠి, జీడిమెట్ల, బీహెచ్‌ఈఎల్-అమీర్‌పేట, నాంపల్లి-చార్మినార్, మెహిదీపట్నం-హైటెక్‌సిటీ-కూకట్‌పల్లి, సికింద్రాబాద్-సైనిక్‌పురి, ఎల్‌బీనగర్-కోఠి. ఈ ప్రాంతాల్లో గాలి నాణ్యతను మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు అవసరమని పీసీబీ స్పష్టం చేసిందివాయు కాలుష్యం పెరగడానికి కేవలం వాహనాలే కాకుండా, నగర శివార్లలో జరుగుతున్న నిర్మాణ పనులు, పరిశ్రమల ఉద్గారాలు కూడా ప్రధాన కారణమవుతున్నాయి. పీఎం-10 స్థాయి పెరగడం వల్ల శ్వాసకోశ వ్యాధులు, ఊపిరితిత్తుల సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

# గ్రామాలకు భారీగా నిధులు

**హైదరాబాద్,మార్చి,18,తెలంగాణ దిశ :** గ్రామాల అభివృద్ధికి కీలకమైన 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలకు కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కేంద్ర ఆర్థిక శాఖ ఉత్తర్వుల మేరకు గ్రామ పంచాయతీలకు తొలి విడతగా రూ. 259.36 కోట్లను విడుదల చేసింది. ఇది రాష్ట్ర గ్రామ పంచాయతీలకు ఊరటనిచ్చే పరిణామం. ఎన్నికల జాప్యంతో తెలంగాణలో రెండేళ్లుగా నిధులు నిలిచిపోయాయి.2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన 15వఆర్థిక సంఘం నిధులు రాష్ట్రానికి రావాల్సి ఉన్నప్పటికీ, పలు కారణాల వల్ల గత రెండేళ్లుగా అవి నిలిచిపోయాయి. దానితో గ్రామ పంచా యతీలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. అయితే కేంద్ర పెద్దలకు రాష్ట్ర పంచాయతీ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క పలు దఫాల విజ్ఞప్తులు చేశారు.గ్రామ పంచాయతీల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మంత్రి సీతక్క ఢిల్లీలో కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తోపాటు ఇతర కేంద్ర పెద్దలను పలు దఫాలు ప్రత్యేకంగా కలిసి రాష్ట్ర పరిస్థితిని వివరించారు.గ్రామ స్థాయి లో అభివృద్ధి పనులకు ఆటంకాలు ఎదురు కావడం , ప్రజలకు కలుగుతున్న అసౌకర్యాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లి నిధులు వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అయితే, ఎన్నికలు పూర్తికాకపో వడం కారణంగా నిధుల విడుదల సాధ్యపడలేదు. ఎన్నికల అనంత రం నిధుల విడుదలకు మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ చూపారు. మార్చి 31లోపు నిధులు విడుదల కాకపోతే నిధు లు శాశ్వతంగా రద్దు అయ్యే ప్రమాదం ఉండటంతో ప్రక్రియను వేగవంతం చేశారు.సంబంధిత శాఖ అధికారులతో పలుసార్లు సమీక్షలు నిర్వహించి నిధులు తీసుకువచ్చే దిశలో దిశా నిర్దేశం చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తికావడంతో పెండింగ్ నిధులు వెంటనే విడుదల చేయాలంటూ మంత్రి సీతక్క కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాశారు. కేంద్ర శాఖలతో నిరంతర సంప్రదింపులు జరిపారు.అదే సమయంలో రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎన్ శ్రీధర్, ఇతర అధికారులు కూడా నిరంతరంగా కేంద్రంతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి నిధుల విడుదలకు కృషి చేశారు.

ఈ ప్రయత్నాల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల ప్రక్రియను ప్రారంభించింది.15వ ఆర్థిక సంఘం సిఫారసుల ప్రకారం రాష్ట్రానికి మొత్తం సుమారు రూ. 3,000 కోట్ల వరకు రావాల్సిఉంది. అందులో తొలి విడతగా రూ. 259.36 కోట్లను విడుదల చేయడం పట్ల గ్రామ పంచాయతీల్లో ఆశలు చిగురించాయి. మిగిలిన నిధులు కూడా దశలవారీగా విడుదల చేయాల్సిఉంది. గ్రామ పంచాయతీలకు ఎంతో కీలకమైన నిధులు విడుదల కావడంపై మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు.ఈ నిధులతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని, అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయని తెలిపారు. అదే సమయంలో మిగిలిన పెండింగ్ నిధులను కూడా ఆలస్యం చేయకుండా వెంటనే విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు.

# కాపు సామాజికవర్గం కోసం..


**హైదరాబాద్,మార్చి,18,తెలంగాణ దిశ :** 2024 ఎన్నికల్లో వైసీపీ ఎందుకు పరాజయం పాలైందనే ప్రశ్నకు ఆ పార్టీ నేతలు, అనుచరులు వివిధ కారణాలు చెబుతున్నారు. కొందరు ఈవీఎంలు కారణమంటూ వ్యాఖ్యానించగా, మరికొందరు కూటమి పార్టీల ఐక్యత వల్ల ఓటమి వచ్చిందని అంటున్నారు. ఇంకొందరు సరైన ప్రచారం చేయలేకపోయామని స్వయంగా ఒప్పుకుంటున్నారు. బలమైన మీడియా ప్రభావం, చంద్రబాబు రాజకీయ వ్యూహాలే కారణమని విమర్శించే వర్గం కూడా ఉంది. ఇవన్నీ కొంతవరకు నిజమే కావచ్చు. కానీ అంతకంటే లోతైన సామాజిక, రాజకీయ అంశాలు కూడా ఈ ఓటమికి కారణమయ్యాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సామాజిక వర్గాల ప్రభావం ఎప్పటినుంచో కీలకం. ముఖ్యంగా గోదావరి జిల్లాలు రాష్ట్ర రాజకీయ దిశను నిర్ణయించే స్థాయిలో ఉంటాయి. 2024 ఎన్నికల్లో అదే జరిగింది. ఈ ప్రాంతంలో బలమైన కాపు సామాజిక వర్గం ఈసారి వైసీపీకి వ్యతిరేకంగా నిలిచింది. వారు పెద్ద ఎత్తున జనసేన వైపు మొగ్గు చూపారు. దీనికి ప్రధానంగా పవన్ కళ్యాణ్ ఆకర్షణ ఒక కారణంగా చెబుతున్నారు. అయితే వైసీపీ నేతలు అవసరానికి మించి పవన్‌పై విమర్శలు చేయడం వల్ల న్యూట్రల్ ఓటర్లు కూడా దూరమయ్యారని రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది. దాని ఫలితంగా ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో వైసీపీకి ఒక్క ఎమ్మెల్యే లేదా ఎంపీ సీటు కూడా దక్కలేదు.చరిత్రను చూస్తే కాంగ్రెస్? టీడీపీ ( పోటీ ఉన్న రోజుల నుంచే గోదావరి ప్రాంతాల్లో టీడీపీకి బలమైన పట్టు ఉంది. అప్పట్లో కొంతవరకు కాంగ్రెస్‌కు కూడా ఆధారం ఉండేది. ఇప్పుడు జనసేన కలిసి రావడంతో ఈ రెండు పార్టీల కలయిక మరింత బలపడింది. యాభై శాతానికి మించిన ఓటు బ్యాంకుతో ఈ జిల్లాలు కూటమికి కంచుకోటలుగా మారాయని అంటున్నారు. ప్రభుత్వం ఏర్పడి దాదాపు 20 నెలలు గడిచినా, అక్కడ వైసీపీ గ్రాఫ్ ఆశించిన స్థాయిలో పెరగలేదన్న మాట వినిపిస్తోంది.

ఎన్నికల అనంతరం కాపు వర్గానికి చెందిన పలువురు కీలక నేతలు వైసీపీని వీడడం కూడా పార్టీకి దెబ్బగా మారింది. మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని టీడీపీలో చేరారు. భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పార్టీకి గుడ్‌బై చెప్పారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబుజనసేనలో చేరారు. ఇలాంటి పరిణామాలతో పార్టీ శ్రేణుల్లో అసంతృప్తి పెరిగిందని అంటున్నారు.ఇటీవల రామచంద్రాపురం కు చెందిన రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ ( పార్టీ మారతారన్న ప్రచారం ఊపందుకుంది. తన కుమారుడికి భవిష్యత్తులో టికెట్‌పై స్పష్టత లేకపోవడం, అలాగే వైసీపీలో గెలుపు అవకాశాలపై సందేహాలు కారణాలుగా చెబుతున్నారు. ఇదే సమయంలో వంగా గీత (, ముద్రగడ కుటుంబం వంటి నేతల విషయంలో కూడా పుకార్లు వినిపిస్తున్నాయి. గోదావరి జిల్లాల్లో కూటమి ఐక్యత బలంగా ఉండటంతో ఎదురీదడం కష్టమని భావిస్తున్న కొందరు నేతలు కొత్త దారులు వెతుకుతున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. రానున్న రోజుల్లో వైసీపీ ఈ పరిస్థితిని ఎలా మార్చుకుంటుందో చూడాల్సి ఉంది.

## లెక్కలేసుకుంటున్న జనాలు - సర్కారీపై బేరీజులు

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు ఓరేంజ్‌లో జరుగుతున్నాయి. ప్రచార వేడి ఊపందుకుంది. ఈ సమయంలో గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనను, ప్రస్తుత రెండేళ్ల కాంగ్రెస్ పాలనను ఓటర్లు బేరీజు వేసుకుంటున్నారు. ముఖ్యంగా పట్టణాల అభివృద్ధిపై రెండు ప్రభుత్వాల ప్రాధాన్యతలు, అమలు చేసిన కార్యక్రమాల్లో స్పష్టమైన తేడాలు కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టణ ప్రగతి పేరుతో ఒక క్రమబద్ధమైన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇందులో ప్రధానంగా మున్సిపాలిటీల్లో పారిశుధ్యం, పచ్చదనం కోసం హరితహారం, మౌలిక సదుపాయాల మెరుగుదలే లక్ష్యంగా పనిచేశారు. ప్రతి మున్సిపాలిటీకి ట్రాక్టర్లు, వైకుంఠధామాలు, వెజ్ అండ్ నాన్-వెజ్ మార్కెట్లు నిర్మించడం ద్వారా పట్టణాల్లో కనీస సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యతనిచ్చారు. నిరంతర నిధుల విడుదల ద్వారా మున్సిపల్ కార్మికుల వేతనాలు, వీధి దీపాల నిర్వహణ వంటి అంశాల్లో ఒక వ్యవస్థను ఏర్పాటు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టణ అభివృద్ధిని భిన్న కోణంలో చూస్తోంది. ముఖ్యంగా చెరువుల ఆక్రమణలను తొలగించడం, అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం మోపడం రేవంత్ ప్రభుత్వ మార్క్ నిర్ణయంగా మారింది. అలాగే, వేల కోట్ల రూపాయలతో చేపట్టిన మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ ద్వారా హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల రూపురేఖలు మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. బీఆర్ఎస్ వసతులపై దృష్టి పెడితే, కాంగ్రెస్ దీర్ఘకాలిక ప్రణాళికలు, పర్యావరణ పరిరక్షణపై మొగ్గు చూపుతోంది. అయితే కాంగ్రెస్ చేపట్టినవి ప్రధానంగా హైదరాబాద్‌కు సంబంధించినవే. ఇతర మున్సిపాలిటీలకు ప్రత్యేకమైన ప్రణాళికలేమీ అమలు చేయలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పట్టణ అభివృద్ధి కోసం బడ్జెట్‌లో భారీగానే కేటాయింపులు చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో నిధుల విడుదలపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. గత ప్రభుత్వం వదిలివెళ్లిన పెండింగ్ బిల్లుల భారం మున్సిపాలిటీలపై ఉండటంతో కొత్త పనులు ప్రారంభించడంలో జాప్యం జరుగుతోంది. ఇందిరమ్మ కమిటీల ద్వారా వార్డుల వారీగా అభివృద్ధి పనులను పర్యవేక్షించాలని, ప్రజా పాలన ద్వారా ఫిర్యాదులను పరిష్కరించాలని రేవంత్ ప్రభుత్వం కొత్త వ్యూహాన్ని అమలు చేస్తోంది. బీఆర్ఎస్ హయాంలో అధికారులు, ఎమ్మెల్యేల పర్యవేక్షణలో పట్టణ ప్రగతి జరిగితే, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన పేరుతో ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లింది. ఉచిత బస్సు ప్రయాణం , ఉచిత విద్యుత్ వంటి గ్యారెంటీలు పట్టణ మధ్యతరగతి ప్రజలపై సానుకూల ప్రభావం చూపాయని ప్రభుత్వం భావిస్తోంది. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు ప్రధానంగా రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు వంటి నిత్యం ఎదుర్కొనే సమస్యలనే ప్రాతిపదికగా తీసుకుంటారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన పార్కులు, మార్కెట్లను కాంగ్రెస్ ఎలా నిర్వహిస్తోంది.. రేవంత్ రెడ్డి తెచ్చిన కొత్త సంస్కరణలు తమ జీవితాలను ఎలా మారుస్తాయి అనే అంశాలను ప్రజలు పోల్చి చూస్తున్నారు. గత పదేళ్ల అభివృద్ధి వర్సెస్ ప్రస్తుత రెండేళ్ల "మార్పు" మధ్య ఈ ఎన్నికల పోరు సాగనుంది. ప్రజల ఓటింగ్ ప్రాధాన్యతలు ఎలా ఉన్నా.. ఈ అంశంలో మాత్రం ప్రజల మధ్యచర్చలు జరుగుతున్నాయి.

# నీరు – ప్రాధాన్యతలు



**హైదరాబాద్,తెలంగాణ దిశ:** ప్రతి ఎకరాకు సాగునీరందేలా సాగునీటి సంఘాలు కృషి చేయాలని అమరావతిలో నిర్వహించిన నీరు-ప్రగతి, జలహారతి సాగునీటి సంఘాల భాగస్వామ్యం కార్యక్రమంలో సిఎం చంద్రబాబు సూచించడం మంచిదే! అలాగే ఈ ఏడాది నుంచి ఖరీఫ్ సాగును ముందస్తుగా ప్రారంభించాలని తుపానుల వల్ల పంటలు దెబ్బతినకుండా రైతులను సన్నద్ధం చేయాలని, కాల్వలకు మే 15 కల్లా నీటిని విడుదల చేయాలని అధికారులను ఆదేశించడం స్వాగతించదగినది. 'వర్షపు నీటిని భూగర్భ జలాలుగా మార్చుకోవాలని, పరిగెత్తే నీటిని నడిపించాలి, నడిచే నీటిని నిలబెట్టాలి, నిలిచిన నీటిని భూగర్భ జలాలుగా మార్చి భూమినే జలాశయంగా మార్చాలి' అని చెప్పడం బాగానే వుంది. రాష్ట్రంలో గోదావరి, కృష్ణా, పెన్నా, వంశధార, నాగావళి వంటి 40 నదులు, 38 వేల చెరువులు ఉన్నాయని, వీటన్నిటిలో 1,300 టిఎంసిలకు పైగా నీటిని నిల్వ చేసుకోగలమనీ, ఈ ఏడాది 862 టిఎంసిల నీళ్లు మన జలాశయాల్లో నిల్వ ఉన్నాయని వాస్తవాలు వివరించారు. పై అంశాలతోపాటు ముఖ్యమంత్రి ప్రస్తావించిన కొన్ని విధానపరమైన విషయాలూ, మీడియాలో వచ్చిన వార్తలూ రైతాంగాన్ని, రాష్ట్ర ప్రజలను కలవరపరుస్తున్నాయి. వరిసాగు తగ్గించి ఎక్కువ మంది రైతులు ఉద్యాన పంటలు, తృణ ధాన్యాల (మిల్లెట్స్) వైపు దృష్టి సారించాలనడం పంటల సరళిని ఏకపక్షంగా మార్చడమే! పంటల సరళిలో మార్పు ఎంతో ప్రణాళికాబద్ధంగా జరగాలే తప్ప హడావుడిగా చేయరాదు. ఆయా పంటల సాగుకు భూసార అనుకూలతలు, నీటిపారుదల సౌకర్యాల లభ్యత లేదా కొరత, పంటల ఉత్పత్తుల వినియోగం, నిల్వ అవకాశాలు, మార్కెట్ పరిస్థితులు వగైరా అనేక అంశాలను శాస్త్రీయంగా అధ్యయనం చేశాకనే నిర్ధారించుకొని, అవసరమైన ప్రోత్సాహకాలిచ్చి అన్నదాతలను అటువైపు మళ్లించవలసి వుంటుంది. కానీ ఆ తరహా ఆలోచనలు, తగిన సన్నాహాలు చేయకుండా ఇటువంటి సలహాలివ్వడం రాష్ట్రానికి శ్రేయస్కరం కాదు. అలాగే 2027 జూన్ కంటే ముందే పోలవరం జాతికి అంకితం చేస్తామంటూనే ఆ ప్రాజెక్టు పూర్తి చేశాక నదుల అనుసంధానం చేపడతామని, పోలవరం నుంచి నీటిని నల్లమల సాగర్‌కు తీసుకెళ్తామని పేర్కొన్నారు. పెండింగ్ ప్రాజెక్టులపై కదా ప్రాధాన్య? అంతేగాక వివాదాస్పదంగావున్న నల్లమల సాగర్ మాట ఇప్పుడు చెప్పడం ద్వారా తెలుగు రాష్ట్రాల మధ్య సఖ్యత, సౌభ్రాతృత్వానికి ఇబ్బందులు తెచ్చుకోవడమే అవుతుంది. అంతేగాక తక్కువ ఖర్చుతో సత్వర ఫలితాలిచ్చే పెండింగ్ ప్రాజెక్టుల్ని పూర్తి చేయడం విజ్ఞతగా ఉంటుంది. రాష్ట్రంలో నీటి వినియోగానికి సంబంధించి కొత్త పాలసీ తీసుకువస్తున్నట్టు, దాన్ని గురువారంనాడు ప్రకటిస్తారనీ విశ్వసనీయమైన ఆంగ్ల మీడియాలో కథనాలొచ్చాయి. ప్రస్తుతం విద్యుత్ రంగంలో అమల్లో ఉన్న రెగ్యులేటరీ కమిషన్‌లా నీటి వినియోగానికి కూడా ఒక కమిషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కూడా వచ్చింది. గతంలోనే ప్రపంచబ్యాంకు సాగు నీటికి రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేయాలని ఆదేశించడం, అందులో భాగంగా సాగునీటి మీటర్ల ఏర్పాటుకు ఆనాటి (చంద్రబాబు నాయుడు) ప్రభుత్వం విఫలయత్నం చేసిన విషయాలు ప్రజల స్మృతి పథం నుండి ఇంకా తొలగిపోలేదు. మళ్లీ అలాంటి ప్రయత్నం చేయడం అన్నదాతలతో సర్కారు కయ్యం తెచ్చుకోవడమే అవుతుంది. నీటి సరఫరాకు చేస్తున్న ఖర్చుకు తగ్గట్టుగా ప్రజల నుండి వసూలు చేసే పన్నులు ఉండేలా చూడటం కూడా పాలసీలో భాగమంటున్నారు. యూజర్ ఛార్జీలు వసూలు చేయకపోతే భవిష్యత్ నిర్వహణ కష్టం అవుతుందని తొలుత పరిశ్రమలతో ప్రారంభించి, ఆ తరువాత అందరికీ దీనిని విస్తరించే అవకాశం ఉందని సమాచారం. అంతకన్నా ముఖ్యంగా నీటి వినియోగ ప్రాధాన్యతల్లోనూ సర్కారు మార్పులు చేయబోతున్నదని వస్తున్న వార్తలు ఆందోళనకరం.

ఇప్పటికే ప్రభుత్వం పంటలకంటే పరిశ్రమలకు, జెన్‌కో అధ్వర్యంలోని జల విద్యుత్ కన్నా కార్పొరేట్లు తెస్తున్న పంప్డ్ హైడ్రో ప్రాజెక్టులకూ మొగ్గు చూపుతున్న వైనం ద్యోతకమవుతోంది. ఈ నేపథ్యంలో కొత్తగా తెచ్చే జల విధానం పై ఎవరికైనా సందేహాలు కలగడం సహజం. ఏదిఏమైనా అంతర్జాతీయ జల సూత్రాల ప్రకారం ప్రజలకు తాగు నీరు, పంటలకు సాగు నీరు, జల విద్యుత్, ఆ తరువాతనే పరిశ్రమలు, ఇతర అవసరాలనే ప్రాధాన్యత క్రమానికి లోబడి ప్రభుత్వం వ్యవహరించడం సబబుగా ఉంటుంది.

# ఆత్మహత్యల నివారణపై పిహెచ్‌డి చేసిన న్యాయమూర్తి

హైదరాబాద్,తెలంగాణ దిశ: తీవ్రమైన పోటీ, ఒత్తిడి, ఒంటరితనం, నిరాదరణ, ఆర్థిక సమస్యలు చాలామందిని, బాధించే సమస్యలు. వీటిని ధైర్యంగా ఎదుర్కొనడానికి వాళ్లకి శక్తి చాలదు. అలాంటప్పుడే వారికి కుటుంబాల నుండి, సమాజం నుండి, విద్యాసంస్థల నుండి కావాల్సిన మద్దతు అందించాలి. ఆవిధమైన బాధ్యతాయుత, సంస్థాగత చర్యలు తక్షణం తీసుకుంటే ఆత్మహత్యలని నివారించ గలుగుతాం. మద్రాసు హైకోర్టు సిట్టింగ్ జడ్జి ఆర్.ఎన్ మంజుల ఈ ఏడాది జనవరిలో 'ఆత్మహత్యల నివారణ'పై చేసిన థీసిస్‌కి పిహెచ్‌డి పట్టా అందుకున్నారు. న్యాయమూర్తిగా ఉన్న ఆమె తిరిగి విద్యార్థిగా మారి ఈ అంశంపై అధ్యయనం చేశారు. భారతీదశన్ యూనివర్శిటీ మహిళా అభివృద్ధి కేంద్రం ద్వారా నిర్వహించిన ఈ పరిశోధన చెన్నైలోని ఉన్నత విద్యసంస్థల విద్యార్థుల్లో ఆత్మహత్య ఆలోచనల ప్రాబల్యంపై దృష్టి సారించింది. ఈ ధోరణులలో లింగ ఆధారిత అంశాలని కూడా విశ్లేషించింది. జిల్లా కోర్టు జడ్జిగా ఉన్నప్పుడు మంజుల ఎన్నో ఆత్మహత్యల కేసులపై విచారణలు జరిపారు. అవన్నీ ఆమెని తీవ్రంగా కదిలించాయి. ఆ సమయంలో వారికి 'ఎవరూ ఎందుకు సహాయంగా' లేరనే ప్రశ్న ఆమెని ఎంతో బాధించింది. ఆ ఆవేదన నుండే విద్యార్థుల్లో 'ఆత్మహత్య ఆలోచనల వ్యాప్తి, లింగ దృక్పథం'పై అధ్యయనం చేసేలా చేసింది. ఈ అంశంపై తనకి



ఎందుకు ఆసక్తి ఏర్పడిందో ఆమె ఇలా చెప్పారు. 'సాధారణంగా కోర్టుల్లో తీర్పులు వెలువడి నప్పుడు వ్యక్తిగత కేసులు పరిష్కారమైనట్లు భావిస్తారు. అక్కడితో వాటిని విడిచిపెట్టేస్తారు. కానీ వాటి వెనుక 'లోతైన సామాజిక అవగాహన చాలా అవసరమని నేను భావించాను. జిల్లా న్యాయవ్యవస్థ నుండి పదోన్నతి పొందిన తరువాత ఈ అంశంలో పరిశోధన చేయాలని నిశ్చయించుకున్నాను.

గత తొమ్మిదేళ్లుగా జిల్లాల్లో ఎన్నో ఆత్మహత్యల కేసులు, వరకట్న మరణాల కేసులు నా ముందుకు వచ్చాయి. వాటిలో చాలామంది మహిళలు తాము తీవ్రమైన కష్టాల్లో ఉన్నప్పుడు తమ కుటుంబాలని సహాయం కోరారు. కానీ చాలా సందర్భాల్లో ఆ కుటుంబ పరిస్థితులే వారి సమస్యలకి కారకాలుగా మారినట్లు తేలింది. న్యాయమూర్తిగా నేను తీర్పులు మాత్రమే చెప్పగలను. విచారణకి వచ్చిన ఆత్మహత్యల కేసులు నన్ను తీవ్రంగా కలవరపెట్టేవి. ఆ వ్యక్తి చుట్టూ ఉన్న వ్యక్తులు సకాలంలో తనకి కావాల్సిన భావోద్వేగ మద్దతుని అందించడంలో ఎందుకు విఫలమయ్యారో' అని తీవ్రంగా ఆలోచించేదాన్ని. ఆ కేసుల వెనుక ఉన్న సామాజిక సమస్యని అర్థం చేసుకోవాలనే పిహెచ్‌డి చేశాను. దీని కోసం చెన్నైలోని 20 ప్రముఖ విద్యాసంస్థల్లో 2000 మంది విద్యార్థులతో మాట్లాడాను. వారిలో 10.8 శాతం మంది ఆత్మహత్య ఆలోచనల్లో ఉన్నట్లు చెప్పారు. వీరిలో పురుషులు 69.3 శాతం, మహిళలు 30.7 శాతం మంది ఉన్నారు. ఈ ఫలితాల వల్ల ఉన్నత విద్యాసంస్థల్లో ఆత్మహత్యల నివారణకై పాటించాల్సిన మార్గదర్శకాలపై ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రాధాన్యతని సంతరించుకుంది' అని ఆమె అన్నారు. ఈ సందర్భంగా సుప్రీం ఇచ్చిన మార్గదర్శకాలని ఒకసారి గుర్తు చేసుకుందాం.

సుప్రీం ఇచ్చిన మార్గదర్శకాలలో ఈ అంశాన్ని కేవలం వ్యక్తిగత వైఫల్యంగా పరిగణించలేదు. దీన్ని ప్రధాన ప్రజారోగ్య సమస్యగా



అభివర్ణించారు. 2025-26ని మానసిక ఆరోగ్య మద్దతు, సంస్థాగత జవాబుదారీతనం, విద్యాసంస్థల్లో ఆత్మహత్యల నివారణపై దృష్టి సారించే మైలురాయిగా పేర్కొంది. సుప్రీంకోర్టు వెలువరించిన కొన్ని ముఖ్య మార్గదర్శకాలు ..: ఉన్నత విద్యాసంస్థలు, కోచింగ్ సెంటర్లలో పెరుగుతున్న ఆత్మహత్యలు 'కలతపెట్టే విషయాలు'. తీవ్రమైన పోటీ, విద్యా ఒత్తిడి, మద్దతు లేకపోవడం వల్ల ఏర్పడిన సంక్షోభం ఇది. ఆత్మహత్యాయత్నాన్ని నేర రహితం చేయడం : ఐపిసి సెక్షన్ 309 (ఆత్మహత్యకి ప్రయత్నించడం నేరం) ఉన్నప్పటికీ కోర్టు దీన్ని చారిత్రాత్మకమైనదిగా సూచించింది. మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం 2017 ప్రకారం ఆత్మహత్యకి ప్రయత్నించే వ్యక్తులు తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు. కాబట్టి వారికి శిక్ష కాదు. సంరక్షణ, పునరావాసం అవసరం. నూతన భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్)2023 ప్రకారం ఆత్మహత్యాయత్నాన్ని నేరపూరితంగా పరిగణించడం పూర్తిగా తొలగించింది. పాన్-ఇండియా నివారణ మార్గదర్శకాలు (జులై 2025) : ఆత్మహత్యలని అరికట్టడానికి అన్ని విద్యా సంస్థలకి సమగ్రమైన కట్టుబడి ఉండే మార్గదర్శకాలని జారీ చేసింది. తప్పనిసరి నివేదిక : సంస్థలు, విద్యార్థుల ఆత్మహత్యలు లేదా అసహజ మరణాలని వెంటనే పోలీసులకి నివేదించాలి. సహాయక వ్యవస్థలు : 100 మంది కంటే ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న సంస్థలు కనీసం ఒక అర్హత కలిగిన మానసిక కౌన్సిలర్‌ని నియమించాలి. పాఠ్యాంశాలు, పర్యావరణం: విద్యా ఒత్తిడిని తగ్గించేలా సౌకర్యవంతమైన పాఠ్యాంశాలని అభ్యాసంలో చేర్చాలి. మౌలిక సదుపాయాల భద్రత : హాస్టళ్లలో హఠాత్తు చర్యలని నివారించడానికి మెష్ నెట్‌లు లేదా ప్రత్యేకంగా రూపొందించిన సీలింగ్ ఫ్యాన్‌లు వంటి 'ఆత్మహత్య నిరోధక' పరికరాలని తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. పబ్లిక్ షేమింగ్‌పై నిషేధం: మార్కులు, పబ్లిక్ అవమానం, కఠినమైన విద్యా లక్ష్యాల ఆధారంగా బ్యాచ్ విభజన నిషేధం. సిబ్బంది శిక్షణ : బాధ, స్వీయ హాని వంటి హెచ్చరిక సంకేతాలని గుర్తించడంలో సిబ్బందికి తప్పనిసరి శిక్షణ ఇవ్వాలి. సంస్థల బాధ్యత :

సంస్థలు తల్లిదండ్రుల వలె వ్యవహరించాలి. విద్యార్థులు ఒత్తిడికి గురైనప్పుడు చర్య తీసుకోవడంలో ఏదేని సంస్థ వైఫల్యం చెందితే దాన్ని 'సంస్థాగత అపరాధం'గా పరిగణించాలి.

ఆత్మహత్యకి ప్రేరేపించడం (సెక్షన్ 306): ఆత్మహత్యకి ప్రేరేపించడం కేసుల్లో పరిస్థితుల ఒత్తిడి మాత్రమే కాకుండా, ఒకరిని దోషిగా నిర్ధారించే 'సానుకూల చర్య' వంటి ప్రత్యక్ష ఆధారాలు ఉండాలని స్పష్టం చేసింది. జీవించే హక్కుల్లో మానసిక ఆరోగ్యం కూడా ఒకటి : రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం మానసిక ఆరోగ్య హక్కు జీవించే హక్కుల్లో అంతర్భాగమని సుప్రీం కోర్టు గుర్తించింది. - జాతీయ టాస్క్ ఫోర్స్ (2025) : మానసిక ఆరోగ్య సమస్యలని పరిష్కరించడానికి, విద్యార్థుల ఆత్మహత్యలని నివారించడానికి మాజీ న్యాయమూర్తి ఎస్.రవీంద్ర భట్ నేతృత్వంలో జాతీయ టాస్క్ ఫోర్స్ (ఎన్‌టిఎఫ్)ని ఏర్పాటు చేశారు.

# విశాఖపట్నం టు రాయ్‌పూర్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** ఏపీ మీదుగా విశాఖపట్నం నుంచి రాయ్‌పూర్‌కు గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం జరుగుతోంది. ఈ మేరకు విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో పులు వేగవంతం చేశారు.చిన్నయ్యపాలెం దగ్గర ఇంటర్ ఛేంజ్, సూరెడ్డి పాలెం దగ్గర డబుల్ ట్రంపెంట్ కూడా నిర్మాణం చేస్తున్నారు. ఈ పనుల్ని వేగవంతం చేసి వచ్చే ఏడాది నాటికి పనులు పూర్తి చేయాలని భావిస్తున్నారు. ఈ హైవే అందుబాటులోకి వస్తే రాయ్‌పూర్ 6 గంటల్లో వెళ్లొచ్చంటున్నారు.ఆంధ్రప్రదేశ్ మీదుగా నిర్మిస్తున్న మరో గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులపై కీలక అప్డేట్ వచ్చింది. విశాఖపట్నాన్ని రాయపూర్‌తో కనెక్ట్ చేసే ఈ ఆరు లైన్ల ఈ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులు సబ్బవరం- షీలానగర్ మధ్య వేగవంతం అయ్యాయి. ఈ హైవే పనుల్లో భాగంగా చిన్నయ్యపాలెం దగ్గర ఇంటరఛేంజ్ నిర్మాణం జరుగుతోంది. అలాగే సూరెడ్డిపాలెం సమీపంలో డబుల్ ట్రంపెట్ కూడా నిర్మాణం చేస్తున్నారు. అక్కడ భూమిని చదును చేసి ల్యాండ్ ఫిల్లింగ్, డ్రైనేజీల నిర్మాణానికి కాలువల్ని తవ్వుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా పెద్ద, పెద్ద మెషిన్ల సాయంతో కార్మికులు పనుల్ని చేపట్టారు.సబ్బవరం-షీలానగర్ మధ్య చేపట్టిన హైవే పనుల్లో భాగంగా.. అమృతపురం శివారు సూరెడ్డిపాలెం నుంచి షీలానగర్ మొత్తం 12.66 కిలోమీటర్ల మేర నిర్మాణం జరుగుతోంది. అయితే 8 కిలోమీటర్లు ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తున్నారు. ఈ ఎలివేటెడ్ కారిడార్‌తో షీలానగర్ దగ్గర ఎన్‌హెచ్-16, విశాఖపట్నం పోర్టు రోడ్డుకు కనెక్ట్ చేస్తారు. గతంలోనే ఈ రోడ్డుకు నిధులు మంజూరైనా భూసేకరణ ఆలస్యం కావడంతో పనుల్లో కూడా జాప్యం జరిగింది. ఇప్పుడు అన్ని సమస్యలు పరిష్కారం కావడంతో పనులు మరింత ఊపందుకున్నాయి. విశాఖపట్నం-రాయ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ హైవేను నాలుగు ప్యాకేజీలుగా పనులు చేపట్టారు. విజయనగరం జిల్లా కంటకాపల్లి నుంచి అనకాపల్లి జిల్లా సబ్బవరం వరకు నాలుగో ప్యాకేజీ కింద పనులు పూర్తి చేశారు. ఈ హైవే చిన్నయ్యపాలెం దగ్గర అనకాపల్లి-ఆనందపురం హైవేలో కలిసేలా ప్లాన్ చేశారు.రాయ్‌పూర్ వైపు నుంచి వచ్చే వాహనాలు కిలోమీటరు దూరంలో ఉండే సూరెడ్డిపాలెం వరకు అనకాపల్లి-ఆనందపురం హైవేలోనే ప్రయాణించాల్సి ఉంటుంది. అక్కడ డబుల్ ట్రంపెట్ నిర్మాణం జరుగుతోంది.. షీలానగర్ వైపు నుంచి వచ్చే వాహనాలు అనకాపల్లి, ఆనందపురం, రాయపూర్ వైపు వెళ్లేలా ఈ డబుల్ ట్రంపెట్ నిర్మాణం చేపట్టారు. 2027 చివరికి సబ్బవరం-షీలానగర్ మధ్య ఈ హైవే అందుబాటులోకి వస్తుందని భావిస్తున్నారు. ఈ హైవే అందుబాటులోకి వస్తే విశాఖలోని నేషనల్ హైవేపై భారీ వాహనాల రద్దీ తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. అంతేకాదు ఈ హైవే మొత్తం అందుబాటులోకి వస్తే విశాఖపట్నం నుంచి రాయ్‌పూర్ 6 గంటల్లో వెళ్లొచ్చంటున్నారు.

ఫ్రీ సిగ్నల్ జర్నీ: విశాఖపట్నంలో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టే దిశగా మరో ముందడుగు పడింది. నగరంలో కీలకమైన ఎన్ఏడీ కూడలి దగ్గర కాకానినగర్ దగ్గర ఆర్వోబీ ప్రారంభానికి సిద్ధమైంది. ఎయిర్‌పోర్టుకు వెళ్లేందుకు ఇబ్బందులు తొలగిపోతాయని చెబుతున్నారు. ఈ పనునలు ముగింపు దశలో ఉండగా.. ఈ ఆర్వోబీని ఈ నెలలోనే ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాకానినగర్ కూడలికి సమీపంలో అండర్ గ్రౌండ్ బ్రిడ్జి కూడా నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రం సాయంతో హైవేలు, రైల్వే ప్రాజెక్టుల్ని వేగవంతం చేసింది. విశాఖపట్నంలో కీలకమైన ఆర్వోబీ (రైల్ ఓవర్ బ్రిడ్జి) అందుబాటులోకి రాబోతోంది. నగరంలో కీలకమైన ఎన్ఏడీ కూడలికి వెళ్లేందుకు.. అక్కడి నుంచి ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లేందుకు ఈజీగా ఉంటుంది. ఎన్ఏడీ ఫ్లై ఓవర్ నుంచి కాకానినగర్ కూడలికి వెళ్లేందుకు ఈ ఆర్వోబీ పనులు ముగింపు దశకు వచ్చాయి.. త్వరలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తొలగిపోతాయంటున్నారు.వాస్తవానికి ఎన్ఏడీ ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టిన సమయంలోనే ఆ ఆర్వోబీ కూడా రెండేళ్ల క్రితమే పూర్తి చేయాల్సింది. అయితే కోల్‌కతా-చెన్నై మెయిన్ లైన్‌లో నిర్మాణం చేయాల్సి ఉండటంతో అనుమతుల రాకపోవడంతో ఆలస్యం అయ్యింది. ఈ ఆర్వోబీని 18 మీటర్ల

ఎత్తులో 210 మీటర్ల పొడవుతో రైలు పట్టాలపై నిర్మాణం చేశారు. ఆ ఆర్వోబీకి రెండు పక్కల అప్రోచ్ రోడ్లు కూడా ఉన్నాయి. ఎన్ఏడీ కూడలి నుంచి 200 మీటర్లు.. అటు ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డులో 300 మీటర్ల పొడవుతో లింక్ చేస్తున్నారు. ఈ పనులు చివరి దశలో ఉన్నాయి.. ప్రస్తుతం ఎన్ఏడీ వైపు నుంచి మట్టి తవ్వి రోడ్డు నిర్మాణం, రెయిలింగ్ పనులు నిర్వహిస్తున్నారు. ఎయిర్‌పోర్ట్ వైపు తారు రోడ్డు పనుల చేస్తున్నారు.

ఇక్కడ మొత్తం ఆరు రోడ్లు అందుబాటులోకి వస్తాయి. ఎన్ఏడీ ఫ్లై ఓవర్ కింద, పై నుంచి రాకపోకలకు అవకాశం ఉంటుంది.ఈ నెల 15 నుంచి ఆర్వోబీ అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. దీని కోసం 24 గంటలూ పనులు కొనసాగుతున్నాయి.. అయితే కాకాని నగర్ కూడలి దగ్గర విప్ గణబాబు సూచనలతో అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మిస్తున్నారు. కాకానినగర్ కూడలికి 100 మీటర్ల ముందు ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులు కూడా త్వరలోనే మొదలవుతాయని అధికారులు చెబుతున్నారు. ఈ బ్రిడ్జి కూడా పూర్తి చేస్తే సిగ్నల్ లేకుండానే రాకపోకలు సులభంగా ఉంటాయి అంటున్నారు. మొత్తం మీద నగరంలో ట్రాఫిక్ ఫ్రీ జర్నీకి ఈ ఆర్వోబీ కీలకంగా మారనునంది.

# అమ్మ సంతోషమే ముఖ్యం



టాలీవుడ్ నటి సురేఖా వాణి ఆమె కూతురు సుప్రిత నాయుడు మధ్య ఉన్న అనుబంధం గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ తల్లీకూతుళ్లు స్నేహితుల్లా కలిసి ఉండటం, సోషల్ మీడియాలో తరచూ ఫొటోలు, వీడియోలు షేర్ చేస్తూ సందడి చేయడం తెలిసిందే. వారి ఆప్యాయత, ఓపెన్ బాండింగ్ ఎప్పుడూ చర్చనీయాంశం అవుతుంది. ఇటీవల సుప్రీత తన తల్లి భవిష్యత్తు గురించి చేసిన వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి. భర్త మరణం తర్వాత సురేఖ వాణి ఎన్నో కష్టాలు ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఆమెకు కూతురు సుప్రీత ప్రధాన ఆధారం అయింది. ఇప్పుడు అదే కూతురు తన తల్లి జీవితంపై తీసుకున్న నిర్ణయం అందరినీ ఆకట్టుకుంటోంది. నేను పెళ్లి చేసుకునే ముందు, నాఅమ్మకు జీవితంలో ఒక మంచి తోడు ఉండాలి. ఆమెను ప్రేమగా చూసుకునే, గౌరవించే వ్యక్తి రావాలి అని సుప్రీత వెల్లడించింది. ఈ విషయాన్ని తాను కుటుంబ సభ్యులతో కూడా చర్చించానని, వారు కూడా తన అభిప్రాయానికి మద్దతు తెలిపారని చెప్పింది. అయితేఇది కేవలం తన కోరిక మాత్రమే కాదని ఆమె స్పష్టం చేసింది. “అమ్మ సంతోషమే నాకు ముఖ్యం. ఆమె ఏ నిర్ణయం తీసుకున్నా నేను గౌరవిస్తాను. నాన్న స్థానాన్ని మరెవరికి ఇవ్వాలని ఆమెకు ఇష్టం లేదు. ఆమెను బలవంతం చేయను. కానీ అమ్మ ఒంటరిగా ఉండకూడదని మాత్రమే నేను కోరుకుంటున్నాను” అంటూ ప్రేమతో చెప్పిన మాటలు సోషల్ మీడియాలో హృదయాలను తాకుతున్నాయి. ఇప్పటికీ వితంతువుల రెండో పెళ్లిపై సమాజంలో మిశ్రమ అభిప్రాయాలు ఉన్నప్పటికీ, తల్లి భవిష్యత్తు కోసం ముందుగా ఆలోచిస్తున్న సుప్రీత నిర్ణయాన్ని పలువురు అభినందిస్తున్నారు. తల్లికి మంచి జీవితం కావాలని కోరుకునే కూతురి మనసు నిజంగా ప్రశంసనీయమని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. తల్లీకూతుళ్ల మధ్య ఉన్న ఈ ఆప్యాయ బంధం మరోసారి అందరి దృష్టిని ఆకర్షించింది. కాగా, సుప్రీత ప్రస్తుతం టాలీవుడ్‌లో హీరోయిన్‌గా సత్తా చాటుతుంది.

# ఉస్తాద్‌కు భారీ బుకింగ్స్




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా దర్శకుడు హరీష్ శంకర్ తెరకెక్కిస్తున్న మాస్ చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రం ఇప్పటికే భారీ అంచనాలు సృష్టించింది. ఈ సినిమాలో హీరోయిన్లుగా శ్రీలీల, రాశీ ఖన్నా నటిస్తున్నారు. విడుదలకు ముందే ఈ సినిమా పలు రికార్డులను సృష్టించేలా దూసుకెళ్తోంది. ఇటీవల ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా ఈ సినిమాకు మంచి డిమాండ్ ఏర్పడింది. ముఖ్యంగా అమెరికాలోని నార్త్ అమెరికా ప్రాంతంలో 'ఉస్తాద్ భగత్ సింగ్'కు మంచి స్పందన లభిస్తోంది. ఇప్పటికే అక్కడ ప్రీమియర్ షోల బుకింగ్స్ ప్రారంభం కాగా, కొన్ని గంటల్లోనే ఈ సినిమా 50వేల డాలర్లకు పైగా గ్రాస్ వసూలు చేయడం విశేషం. ఇది కేవలం ప్రారంభం మాత్రమే అని సినీ వర్గాలు భావిస్తున్నాయి. పవన్ కళ్యాణ్‌కు విదేశాల్లో ఉన్న భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ దృష్ట్యా, రాబోయే రోజుల్లో బుకింగ్స్ మరింత పెరిగే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా సినిమా కంటెంట్ బలంగా ఉంటే, నార్త్ అమెరికా మార్కెట్‌లో భారీ వసూళ్లు సాధించే అవకాశముందని అంచనా వేస్తున్నారు. ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకులు దేవి శ్రీ ప్రసాద్, థమన్ సంగీతం అందిస్తున్నారు. భారీ నిర్మాణ విలువలతో ఈ సినిమా ను మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ? హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమా పై అభిమానుల్లో ఇప్పటికే భారీ క్రేజ్ నెలకొంది. మాస్ యాక్షన్ ఎంట్టంల్గ÷నర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. విడుదలకు ముందే ఓవర్సీస్‌లో మంచి బిజినెస్ సాధించడంతో, బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఓజీ చిత్రం తర్వాత పవన్ కళ్యాణ్ నుండి వస్తున్న ఈ సినిమా ప్రభంజనాలు సృష్టించడం ఖాయం అని అంటున్నారు.

# చిన్న పిల్లలపై అత్యాచారాలు అరికట్టాల్సిందే



తెలుగు, తమిళ సినీ పరిశ్రమల్లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా మంచి గుర్తింపు పొందిన వరలక్ష్మి శరత్ కుమార్ తాజాగా చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల ఆమె ప్రధాన పాత్రలో నటిస్తూ దర్శకత్వం వహించిన సరస్వతి సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో చిన్నారులపై జరిగే అత్యాచారాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నపిల్లలపై జరుగుతున్న లైంగిక దాడులు సమాజానికి పెద్ద ప్రమాదంగా మారుతున్నాయని ఆమె అన్నారు. అలాంటి నేరాలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 'చిన్న పిల్లలను హరాస్ చేసే వాళ్లను, అత్యాచారం చేసే వాళ్లను అసలు వదిలిపెట్టకూడదు. వాళ్లకు సాధారణంగా మరణశిక్ష ఇవ్వడం సరిపోదు. అలాంటి వాళ్లకు మరింత కఠినమైన శిక్షలు ఉండాలి, కట్ చేసి పడేయాలి' అని వరలక్ష్మి పేర్కొన్నారు. నేను ఎప్పుడైనా ముఖ్యమంత్రి అయితే రేప్ లాంటి నేరాలకు పాల్పడే అబ్బాయిలకు కఠినమైన శిక్ష విధించేలా ప్రత్యేక చట్టం తీసుకువస్తాను. అప్పుడు అలాంటి నేరాలు చేయడానికి కూడా వాళ్లు భయపడతారు. సమాజంలో ఆ భయం రావాలి అని ఆమె అన్నారు. అదే సమయంలో పిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులు కూడా జాగ్రత్తగా ఉండాలని వరలక్ష్మి సూచించారు. చిన్నారులకు చిన్నప్పటి నుంచే 'గుడ్ టచ్', 'బ్యాడ్ టచ్' గురించి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. పిల్లలకు ధైర్యం ఇవ్వడం, ఏదైనా తప్పు జరిగితే చెప్పేలా వారికి నమ్మకం కల్పించడం ఎంతో ముఖ్యమని ఆమె అభిప్రాయపడ్డారు. ఇక వరలక్ష్మి శరత్‌కుమార్ నటించిన సరస్వతి సినిమా చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడుల నేపథ్యంలో రూపొందిన సామాజిక అంశాలతో కూడిన చిత్రంగా తెరకెక్కింది.

# సినిమా



## 'వారణాసి' నెక్ట్స్ షెడ్యూల్‌పై హింట్ ఇచ్చిన ప్రియాంక చోప్రా




సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం 'వారణాసి'పై రోజురోజుకు అంచనాలు పెరుగుతున్నాయి. భారీ బడ్జెట్‌తో పాన్ వరల్డ్ స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రం ప్రస్తుతం జార్జియాలో కీలక షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంటోంది. ఈ యాక్షన్ అడ్వెంచర్ డ్రామాలో గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా కీలక పాత్రలో నటిస్తుండగా, మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారు. అలాగే ప్రకాష్ రాజ్, ఆర్. మాధవన్ వంటి అగ్ర నటులు ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడం సినిమాకు మరింత బలం చేకూరుస్తోంది. ఇటీవల ప్రియాంక చోప్రా నటించిన హాలీవుడ్ చిత్రం 'ది బ్లఫ్'ను చూసిన మహేష్ బాబు, ఆమె నటనపై ప్రశంసలు కురిపించారు. దీనికి ప్రియాంక “సీ యూ సూన్ ఇన్ అంటార్కిటికా” అంటూ రిప్లై ఇవ్వడం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. ఈ కామెంట్‌తో 'వారణాసి' నెక్ట్స్ షెడ్యూల్ అంటార్కిటికాలో జరగనుందనే ఊహాగానాలు మొదలయ్యాయి. విభిన్నమైన లొకేషన్లు, భారీ విజువల్స్ రాజమౌళి సినిమాల ప్రత్యేకత అన్న విషయం ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇప్పటికే జార్జియా అడవుల్లో యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. ఇప్పుడు అంటార్కిటికా షెడ్యూల్ ఉంటే, అది భారతీయ సినీ చరిత్రలో అరుదైన ఘట్టంగా నిలిచే అవకాశముంది. ఈ చిత్రాన్ని దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కె.ఎల్. నారాయణ నిర్మిస్తున్నారు. కథను ప్రముఖ రచయిత విజయేంద్ర ప్రసాద్ అందించగా, ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతం సమకూరుస్తున్నారు. విజువల్ ఎఫెక్ట్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, భారీ యాక్షన్ సీక్వెన్స్‌లతో ఈ చిత్రాన్నిఐమ్యాక్స్ అనుభూతిని ఇచ్చేలా రూపొందిస్తున్నారని సమాచారం.'వారణాసి' చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా పలు భాషల్లో ఏప్రిల్ 7, 2027న విడుదల చేయాలని చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది. రాజమౌళి–మహేష్ బాబు కాంబినేషన్ కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై అంతర్జాతీయ స్థాయిలో కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే జార్జియా షెడ్యూల్ ముగిసిన తర్వాత అంటార్కిటికాలో చిత్రీకరణ ఉంటుందా? అన్న ఉత్కంఠ అభిమానుల్లో నెలకొంది. మొత్తానికి 'వారణాసి' ఇండియన్ సినిమా స్థాయిని మరింత ఎత్తుకు తీసుకెళ్లే ప్రాజెక్ట్‌గా మారుతుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

# సల్మాన్‌కు జోడీగా నయనతార



దక్షిణాదిన అగ్రస్థానంలో ఉన్న కథానాయిక ఎవరంటే.. 'నయనతార' అని టక్కున చెప్పేస్తారు. పారితోషికం పరంగా కూడా నయనే నంబర్ వన్. ప్రస్తుతం ఆ భాష, ఈ భాష అని లేకుండా, అన్ని భాషల్లోనూ సినిమాలు చేస్తూ సత్తా చాటుతున్నది నయనతార. మెగాస్టార్‌తో ఆమె రీసెంట్ హిట్ 'మన శంకర వరప్రసాద్‌గారు' టాలీవుడ్ రీజనల్ సినిమాల్లో నంబర్‌వన్ హిట్‌గా నిలిచింది. ప్రస్తుతం బాలకృష్ణ 'ఎన్‌బికె 111'లో కథానాయికగా నటిస్తున్నది నయనతార. ఇక తమిళంలో అయితే.. ఆమె చేతిలో చాలా సినిమాలున్నాయి. ఇదిలావుంటే.. రీసెంట్‌గా ఓ బాలీవుడ్ సినిమాకు నయన్ సైన్ చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్‌ఖాన్ హీరోగా రూపొందనున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి టాలీవుడ్ డైరెక్టర్ పైడిపల్లి వంశీ దర్శకుడు. దిల్‌రాజు నిర్మిస్తారట. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే రానున్నది. ఇక నయన్ నటించిన తమిళ చిత్రం 'ముక్తీ అమ్మన్' సమ్మర్‌లో విడుదల÷ూనుంది.

# చిత్ర పరిశ్రమలో ట్రోల్స్ పెద్ద పదం

## ఇప్పుడిప్పుడే అలవాటు పడుతున్నా

విమర్శల నుంచి నేను చాలా నేర్చుకున్నానంటోంది హీరోయిన్ ప్రియాంక అరుళ్ మోహన్. 'మేడ్ ఇన్ కొరియా' సినిమాతో త్వరలోనే వీక్షకులందరికీ కొరియా సంస్కృతిని పరిచయం చేసే తమిళ అమ్మాయిగా ఓటీటీలో సందడి చేయనుంది. ఈ సందర్భంగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె సామాజిక మాధ్యమాల్లో తనపై వస్తున్న ట్రోల్స్ గురించి స్పందించింది. 'సోషల్ మీడియాలో 'ట్రోల్స్' అనేది చాలా పెద్ద పదం. గతం గురించి ఆలోచించడం నాకు ఇష్టం లేదు. కానీ, ఇది చిత్రపరిశ్రమ. అనిశ్చితమైన పరిస్థితులు ఎదురవుతాయి. ఇక్కడ ఎవరికైనా ఏదైనా జరగొచ్చు. నేను దాని నుంచే చాలా నేర్చుకున్నాను. సహజంగానే ట్రోల్స్ బాధించినా ఎదగడానికి తోడ్పడతాయి. కొన్నిసార్లు మీరు పడిపోతేనే పైకి రావడానికి అలాంటివి సహాయపడతాయి. నేను ఇలాంటి ప్రతికూల పరిస్థితులను సానుకూలంగా మార్చుకుంటూ కెరీర్‌ని ముందుకు తీసుకెళ్లాలనుకుంను' అని చెప్పింది. గతంలో ప్రియాంక తనపై కొందరు ఉద్దేశపూర్వకంగానే ట్రోల్స్ చేస్తున్నట్లు వెల్లడించిన సంగతి తెలిసిందే.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215